
కేరింతల జోరు..

ఉష్ణోగ్రతలు 10-3-2024
గరిష్ఠం : 40.0
కనిష్ఠం : 25.0


యువ నేత అభివాదం..

ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం సభలకు పోటెత్తిన జనం

యువత కేరింతలు... మహిళల ఉత్సాహం..

సభల విజయవంతంతో పార్టీ కేడర్‌లో జోష్

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితోనే జిల్లా అభివృద్ధి

శంఖారావం సభల్లో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్

కళ్యాణదుర్గంలో...

జన శంఖారావం

అనంతపురం మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జిల్లాలో చేపట్టిన మలి విడత శంఖారావం సభలకు జనం పోటెత్తారు. ఆదివారం ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో నిర్వహించిన శంఖారావం సభలకు పార్టీ శ్రేణులతో పాటు యువత, మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. శంఖారావం సభలు జయప్రదం కావడం పార్టీ కేడర్‌లో మరింత జోష్‌ను పెంచింది. ఆయా సభల్లో ఉమ్మడి అనంత జిల్లాపై నారా, నందమూరి కుటుంబాలకు ఉన్న అభిమానం, ప్రేమ, అనుబంధాన్ని నారా లోకేశ్ గుర్తు చేశారు. తమ కుటుంబానికి అనంత ఉమ్మడి జిల్లా అంటే ప్రేమ అన్నారు. ఇక్కడికి వస్తే సొంత ఇంటికి వచ్చిన భావన కలుగుతుందని జిల్లాపై ఆ కుటుంబాలకు ఉన్న అభిమానాన్ని లోకేశ్ చాటారు. పాదయాత్రలో జిల్లా ప్రజలు తనను అక్కున చేర్చుకొని ఆప్యాయతను అందించారని గుర్తు చేశారు. దివంగత ఎన్టీఆర్‌ను గెలిపించి ఆంధ్రప్రదేశ్‌కు సీఎంగా చేసిన ఘనత అనంత జిల్లా ప్రజలదన్నారు. ఒక మామయ్య హరికృష్ణను ఎమ్మెల్యేగా గెలిపించారు.. మీ అందరి బాలయ్య.. నా కొక్కడికే ముద్దుల మామయ్య బాలకృష్ణను రెండు సార్లు అసెంబ్లీకి పంపిన చరిత్ర అనంత జిల్లా ప్రజలదన్నారు. జిల్లా ప్రజలు చూపిస్తున్న అభిమానం, ప్రేమ ఎన్నటికీ మరులేనన్నారు. అందుకే జిల్లా ప్రజలు ఇచ్చిన ప్రేమకు రెట్టింపు ప్రేమతో కరువు జిల్లాలో యువత కు ఉపాధి కల్పించడానికి కియ పరిశ్రమను తెచ్చామన్నారు. కియ, అనుబంధ పరిశ్రమల ద్వారా 50వేల మందికి ఉద్యోగ అవకాశం కల్పించా మన్నారు. 1.30 లక్షల మంది రైతులకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరా లు అందించా మన్నారు. ఒక ఏడాదిలో ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా రూ.2వేల కోట్లు కరువు రైతులకు అందించి ఆదుకున్న ఆదుకున్న ఘనత టీడీపీదే అన్నారు. కరువు పరిస్థితుల్లో ట్యాంకర్లు పెట్టి చీనీ చెట్లకు నీరు అందించి కాపాడిన ఘనత చంద్రబాబుకు దక్కుతుందన్నారు. టీడీపీ పాలనలో అనంతను హార్టికల్చర్ హబ్‌గా మార్చామన్నారు. అరటి రైతుల ఆదాయం రెట్టింపు చేశామన్నారు. రోడ్లు, బ్రిడ్జిలు, ఆస్పత్రులు ఇతర అభివృద్ధి కార్యక్రమాలు టీడీపీ హయాంలో చేశామన్నారు. పాలిచ్చే ఆవును కాదని.. తన్నే దున్నపోతును తెచ్చుకోవడంతోనే జిల్లాలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు సన్నగిల్లిపోయాయని ఆవేదన చెందారు. అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలిపేందుకు ప్రజలు సంసిద్ధులు కావాలని ఆయన జిల్లా ప్రజానీకాన్ని కోరారు. మరో 40 రోజుల్లో ఎన్నికలు జరగనున్నాయి... ప్రతి ఒక్కరూ సైకిల్ బొమ్మ.. టీడీపీ క్యాప్ పెట్టుకొని ప్రతి గడపకు తిరగాలన్నారు. మరో పది రోజుల్లోగా సూపర్ సిక్స్ క్యాలెండర్‌ను ప్రతి గడపకు చేర్చాలన్నారు. టీడీపీ పాలనలో అమలు చేసిన ఏ పథకాలైతే ఆగిపోయాయో వాటన్నింటినీ పునరుద్ధరించి అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుస్తామని ఆయన హామీ ఇచ్చారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూట మిని గెలిపించి అభివృద్ధి, సంక్షేమం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందేందుకు రాచబాట వేసుకునే విధంగా పని చేయాలని కోరారు.


జనం నడుమ...

శంఖారావం సభలకు తగిన భద్రత కల్పించండి

ఎస్పీని కోరిన మాజీ మంత్రి కాలవ

అనంతపురం మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అనంతపురం అర్బన్, తాడిపత్రి నియోజకవర్గాల్లో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సోమవారం నిర్వహించనున్న శంఖారావం సభలకు తగిన భద్రత కల్పించా లని ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు జిల్లా ఎస్పీని కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఎస్పీకి లేఖ ద్వారా విన్నవించారు. ఆదివారం ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో నిర్వహించిన సభలకు పెద్ద ఎత్తున జనం తరలివచ్చార న్నారు. బహిరంగ సభలు సజావుగా నిర్వహించేందుకు తగిన భద్రత కల్పించాలని స్థానిక పోలీసు అధికారులకు ముందస్తు సమాచారం ఇచ్చామని ఆయన ఎస్పీకి ఆ లేఖలో స్పష్టం చేశారు. అయినప్పటికీ తగినంత భద్రత కల్పించకపోవడంతో జనాన్ని నియంత్రించలేకపోయారన్నారు. తద్వారా ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ విభాగం నుంచి పర్సనల్ సెక్యూరిటీ అధికారిపై జనం ఒక్కసారిగా మీద పడటంతో సంబంధిత అధికారి రాంబాబు గాయపడ్డారన్నారు. ఈ ఘటనను దృష్టిలో ఉంచుకొని సోమవారం జరగనున్న అనంతపురం అర్బన్, తాడిపత్రి శంఖారావం సభలు సజావుగా జరిగేందుకు తగిన భద్రతను కల్పించాలని ఆయన ఎస్పీని కోరారు.




ఉరవకొండలో...


చిన్నారి ముద్దు..


రాయదుర్గంలో...

అరాచక పాలన అంతానికే పొత్తు

మాజీ మంత్రి పరిటాల సునీత



అనంతపురం మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అరాచక పాలనను అంతమొందించేందుకే టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు పొత్తు పెట్టుకున్నాయని మాజీ మంత్రి పరిటాల సునీత పేర్కొన్నారు. అనంతపురంలోని తన స్వగృహంలో ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ మొదటి నుంచి రాష్ట్ర ప్రయోజనాల కోసమే పరితపిస్తోందన్నారు. అందుకే 2014 ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కలిశాయని గుర్తు చేశారు. 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్ర ప్రజలు ఎంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వ వైఖరితో అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయారన్నారు. ఇలాంటి దుర్మార్గపు పాలన పోవాలంటే మరోసారి 2014 పరిస్థితులు రిపీట్ కావాల్సిన అవసరం ఉందన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు ఈ ఆలోచనలతోనే బీజేపీతో కలిశారన్నారు. జగన్‌రెడ్డి పాలనలో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలపై దాడులు పెరిగిపోయాయన్నారు. బీజేపీతో పొత్తు పెట్టుకున్నంత మాత్రాన మైనార్టీలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. 2014 నుంచి 2019 వరకు మైనార్టీల కోసం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. వైసీపీ పాలనలో ప్రభుత్వం అంటే జగన్ రెడ్డి, విజయసాయిరెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, ధనుంజయరెడ్డిగా మారిందన్నారు. రాష్ట్రాన్ని కాపాడుకునేందుకే మూడు పార్టీలు కలిశాయని, ప్రజలంతా ఈ పొత్తును స్వాగతిస్తున్నారన్నారు. ఈ మూడు పార్టీల పొత్తుతో రాబోవు ఎన్నికల్లో వైసీపీ అరాచక పాలన అంతం కావడం తథ్యమన్నారు.

చరిత్ర, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి

జిల్లా కలెక్టర్ గౌతమి


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గౌతమి

అనంతపురం కల్చరల్, మార్చి 10: జిల్లా చరిత్ర, సంప్రదాయాలు, పురావస్తు సంపదను భావితరాలకు అందించాలని జిల్లా కలెక్టర్ గౌతమి పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని ఆదిమూర్తినగర్‌లో నూతనంగా నిర్మించిన పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు జిల్లా పురావస్తు ప్రదర్శనశాలను ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ గౌతమితో పాటు మంత్రి ఆర్‌కె రోజా, పురావస్తు ప్రదర్శనశాలల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ వాణి మోహన్ ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వారసత్వ సంపదను కళ్లకు కట్టినట్లు తెలియజేసేలా, అధునాతనంగా రూ.7కోట్ల వ్యయంతో పురావస్తు ప్రదర్శనశాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇందులో పురాతన శిలాయుగం, మధ్య శిలాయుగం, పూర్వ, చారిత్రక గ్యాలరీలు, రాతి, జైన శిల్పాలు, బూడిద ముద్దలు, ఇనుప పనిముట్లు, ఎర్రకోట బొమ్మలు, ఇటుకలు, నాణేలు, పెయింటింగ్స్, పింగాణి సామాను, ఆయుధాలు వంటివి ఏర్పాటు చేసినట్లు వివరించారు. రాగి, పంచలోహ విగ్రహాలు, తాళపత్ర గ్రంథాలు, రాతి పనిముట్లు, బంగారు, వెండి నాణేలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పిల్లలు, పెద్దలు అందరూ మ్యూజియంను సందర్శించి మన వారసత్వ సంపద గొప్పతనం తెలుసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, పురావస్తు శాఖ ఏడీ రజిత తదితరులు పాల్గొన్నారు.

వైభవోపేతం.. బుగ్గరామలింగేశ్వరుడి కల్యాణం

కన్నుల పండువగా సాగిన రథోత్సవం

తాడిపత్రిటౌన్, మార్చి 10: వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం బుగ్గరామలింగేశ్వరస్వామి, పార్వతీదేవి అమ్మవారి కల్యాణాన్ని వేదపండితు లు అంగరంగవైభవంగా జరిపించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. స్వామివారి కల్యాణం తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో హాజర య్యారు. సాయంత్రం మహారథోత్సవం కన్నులపండువగా జరిగింది. పట్టణంలోని మెయిన్‌బజారు, గాంధీకట్ట, అభయాంజనేయస్వామి విగ్రహం వరకు రథోత్సవం నిర్వహించారు. మహారథోత్సవంలో వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొని రథాన్ని లాగారు. రథోత్సవం ముందు నిజామాబాద్ మహిళా కళాకారులు తప్పెట్ల కార్యక్రమం నిర్వహించారు. ఒంగోలు ఉమామహేశ్వరి ఈవెంట్ వారు పరమేశ్వరుడి వేషధారణ, నృత్యప్రదర్శన, డ్రమ్స్ వాయిద్యాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మహిళల తప్పెట్ల కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పలువురు దాతలు భక్తులకు మజ్జిగ, మంచినీటి ప్యాకెట్లను అందించారు.

కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



భక్తుల నడుమ సాగుతున్న మహా రథోత్సవం

ఎస్కేయూ గెస్ట్ లెక్చరర్ హత్య

కత్తితో దాడి చేసి చంపిన మేనల్లుడు

పోలీసుల అదుపులో నిందితుడు


మూర్తి రావు హోకలే (ఫైల్)

అనంతపురం క్రైం, మార్చి 10: ఎస్కే యూనివర్సిటీలో గెస్ట్ లెక్చరర్‌గా పనిచేస్తున్న మూర్తి రావు హోకలే(59) దారుణ హత్యకు గురయ్యారు. నగరంలోని జేఎన్‌టీయూ కళాశాల ఎదుట మూర్తి రావు హోకలే నివాసంలో ఆదివారం రాత్రి ఈ ఘటన జరిగింది. మృతుడి అక్క కుమారుడు ఆదిత్య ఈ దారుణానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన మేరకు.. మూర్తి రావు హోకలే ఇదివరకు అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేశారు. నాలుగు నెలల క్రితం అక్కడ మానేసి ఎస్కేయూలో గెస్ట్ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. హోకలే అక్క నాగరత్నబాయి ప్రస్తుతం నగరంలోని ఓ అనాథాశ్రమంలో నివాసం ఉంటున్నారు. ఆమె కుమారుడు ఆదిత్య తిరుపతిలో ఎంటెక్ పూర్తి చేశాడు. గత కొంతకాలంగా తమకు మూర్తి రావు హోకలే ఆర్థిక సహకారం అందించలేదని, ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి ఇప్పించకపోవడంతో ఆదిత్య కోపంగా ఉండేవాడని సమాచారం. ఈ క్రమంలో ఆదివారం తన మామ ఇంటికి వచ్చిన ఆదిత్య వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో కోపంతో దాడి చేసి కత్తితో మెడ, గొంతుపై కోయడంతో మూర్తిరావు తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిందితుడు ఆదిత్యను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఆర్థిక సహకారం అందించకపోవడంతో పాటు ఉద్యోగం ఇప్పించలేదనే కారణంతోనే హత్య చేసినట్లు ఆదిత్య పోలీసుల విచారణలో చెప్పినట్లు తెలిసింది. ఆదిత్యకు సంబంధించిన సర్టిఫికెట్లు సైతం మూర్తిరావు తన వద్దే ఉంచుకున్నాడనే కారణాన్ని వెల్లడించినట్లు తెలుస్తోంది. పోలీసులు కేసును వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

శంఖారావం... సూపర్‌హిట్



ఉరవకొండలో నిర్వహించిన శంఖారావం సభలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలదండ వేస్తున్న నారా లోకేశ్, పయ్యావుల కేశవ్

తండ్రీకొడుకులది దోపిడీ

ఐదేళ్లలో నియోజకవర్గానికి చేసిందేమీ లేదు

మాజీ ఎమ్మెల్యే 'విశ్వ'పై నారా లోకేశ్ విమర్శలు

గుంతకల్లు/ఉరవకొండ, మార్చి10: మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి నియోజక వర్గానికి ఐదేళ్లలో చేసిందేమీ లేదని, విశ్వ, ఆయన కొడుకు కలిసి దోచుకున్నారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విమర్శించారు. ఆదివారం ఉదయం ఉరవకొండలో నిర్వహించిన శంఖారావ బహిరంగ సభలో లోకేశ్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే విశ్వ, ఆయన కుమారుడు దొంగ ఆధార్ కార్డులు, పత్రాలు సృష్టించి ప్రైవేటు భూములు కొట్టేశారన్నారు. పొరపాటున కూడా మీ ఇల్లు వారికి చూపించరాదని, అది వారికి నచ్చితే దాన్ని కూడా దొంగ రికార్డులతో స్వాహా చేస్తారని విమర్శించారు. 'విశ్వేశ్వర రెడ్డీ! ఎమ్మెల్యేగా ఉన్నపుడు నియోజకవర్గానికి ఇది కావాలి అని అడిగావా?, కనీసం ఇప్పుడైనా నీ నాయకుడిని అడిగావా?' అని ఎద్దేవా చేశారు. సీఎం జగన్ ఇచ్చిన హామీలు కూడా ఈ ఐదేళ్లలో అడగలేదన్నారు. హంద్రీనీవా పనులు కూడా పూర్తి చేస్తామని చెప్పిన జగన్ మాట తప్పారన్నారు. 80 వేల ఎకరాలకు సాగు నీరు అందిస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు.

టీడీపీ హయాంలోనే నియోజకవర్గ అభివృద్ధి

టీడీపీ హయాంలోనే నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసినట్లు వివరించారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే కేశవ్‌కు మైక్ ఇవ్వడం లేదంటే వైసీపీ పాలకులు ఎంత భయపడుతున్నారో అర్థమవుతోందన్నారు. టీడీపీ హయాంలో ఎమ్మెల్యేగా కేశవ్ గెలవకపోయినా పనులు చేశారన్నారు. రూ.890 కోట్లతో మెగా డ్రిప్ ప్రాజెక్టు, మూడు వేల మందికి ఇళ్ల పట్టాలు ఇప్పించారన్నారు. ఎన్టీఆర్ గృహపథకం కింద నియోజక వర్గానికి 18వేల ఇళ్లు తీసుకువచ్చిన ఘనత కేశవ్‌దే అని ప్రశంసించారు. రెండు నెలలు ఓపిక పడితే పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు.

జగన్ ప్రభుత్వాన్ని దించడానికి జనం సిద్ధం

టీడీపీ ప్రభంజనం ఢిల్లీదాకా వినిపిస్తోంది

ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్



విక్టరీ గుర్తు చూపుతున్న కార్యకర్తలు

రాష్ట్రంలో కొనసాగుతున్న అరాచక ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలిపేందుకు ప్రజలే కాదు జగన్ తల్లి, చెల్లి కూడా సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఉరవకొండ శివారులోని అనంతపురం- బళ్లారి రహదారిలోని పెట్రోల్ బంక్ సమీపంలో ఆదివారం ఉదయం టీడీపీ శంఖారావం సభ నిర్వహించారు. ఈ సభలో ఎమ్మెల్యే కేశవ్ మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు కీలక పరిణామం అన్నారు. ఈ కూటమి ప్రభంజనంతో అరాచక ప్రభుత్వం అడ్రస్ లేకుండా పోతుందన్నారు. టీడీపీని బీజేపీ కలుపుకుందంటే ఏపీ ఎన్నికల నాడి ఢిల్లీదాకా తెలిసిపోయిందన్నారు. ఈ చారిత్రక కలయిక ద్వారా రాష్ట్రానికి మేలు జరుగుతుందన్నారు. అభివృద్ధితో ఆదాయాన్ని సృష్టించి పేదలకు ఇవ్వడం చంద్రబాబు సిద్ధాంతమైతే, చేతకాక అప్పులు తెచ్చి పంచడం జగన్ నైజమన్నారు. దీంతో రాష్ట్రం ఆర్థికంగా కుప్పకూలే పరిస్థితి ఏర్పడిందన్నారు. వైసీపీకి ప్రధాన ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా తరిమికొట్టాలని పిలుపినిచ్చారు. ఉరవకొండలో జల దీక్ష సమయంలో అధికారంలోకి వచ్చిన మూడు నెలలోపు 80 వేల ఎకరాలకు హంద్రీనీవాకు నీరు ఇస్తామని చెప్పిన జగన్, అధికారంలోకి వచ్చి ఐదేళ్లైనా మూడు ఎకరాలకు నీరు ఇవ్వలేదన్నారు. జీబీసీ ఆధునికీకరణ, హంద్రీనీవా నుంచి జీబీసీకి నీరివ్వడం, డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్టును మంజూరు చేయించానన్నారు. విశ్వ మూడు తట్టల మట్టి తీయలేదని విమర్శించారు. జలదీక్ష మాని.. ధనదీక్షలో పడిపోయి, దోచుకోవడమే పనిగా పెట్టుకున్నాడని ఆరోపించారు. 28 ఏళ్ల వయస్సులో రాజకీయాల్లోకి వచ్చిన తనను నియోజకవర్గ ప్రజలు ఆదరించారని, 1994 ఫలితాలు పునరావృతమయ్యే లా ఓటువేయాలని, చరిత్రను తిరగరాయాలని పిలుపునిచ్చారు.





అభివాదం చేస్తున్న నారా లోకేశ్

రాయదుర్గం శంఖారావం సభకు హాజరైన జనం

సభలకు పోటెత్తిన జనాలు... లోకేశ్ ప్రసంగాలకు అద్భుత స్పందన

నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం

'జిల్లాలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పాల్గొన్న శంఖారావం సభలకు జనం పోటెత్తారు. ఆదివారం ఆయన ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో నిర్వహించిన శంఖారావం సభల్లో పాల్గొన్నారు. ఆయా సభల్లో అధికార పార్టీ తీరును ఎండగడుతూ లోకేశ్ చేసిన ప్రసంగాలకు అద్భుత స్పందన లభించింది. సీఎం జగన్ మొదలు, మంత్రులు, ఎమ్మెల్యేలు అధికార పార్టీ నాయకులపై లోకేశ్ చెణుకులు విసురుతూ కార్యకర్తలను ఉర్రూతలూగించారు. ఆయా ప్రాంతాల్లోని సమస్యలను ఎత్తి చూపుతూ, తాము అధికారంలోకి వస్తే వాటిని ఎలా పరిష్కరిస్తామో వివరించారు. గత టీడీపీ పాలనకు ప్రస్తుత వైసీపీ పాలనకు ఉన్న తేడాను ఎత్తి చూపుతూ లోకేశ్ ప్రసంగించిన తీరు సభికులను ఆకట్టుకుంది. మొత్తంగా మూడు నియోజకవర్గాల్లో నిర్వహించిన శంఖారావం సభలు ఒకదానికి మించి మరొకటి విజయవంతం కావడంతో నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది.'

దుర్గం పసుపుమయం

రాయదుర్గం, మార్చి 10: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ రాకతో రాయదుర్గం పసుపుమయం అయ్యింది. శంఖారావం సభకు జనం పోటెత్తారు. లోకేశ్‌ను చూసిన ఆనందంలో టీడీపీ శ్రేణులు ఈలలు, కేకలతో సభా ప్రాంగణాన్ని హోరెత్తించాయి. ఆయనతో కరచాలనం చేసేందుకు ఎగబడ్డారు. అందుకుతగ్గట్టుగానే లోకేశ్ ప్రసంగం సాగడంతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. కణేకల్లు రోడ్డులోని రాయల్ ఎంసీఏ కళాశాల వద్ద ఆదివారం శంఖారావం సభను నారా లోకేశ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం లభించింది. ముఖ్యంగా లోకేశ్ వేదిక మీదకు రాగానే ఈలలు, చప్పట్లతో కేరింతలు కొడుతూ కార్యకర్తలు పెద్ద ఎత్తున స్వాగతించారు. ఉత్సాహంతో కొంతమంది యువకులు లోకేశ్‌ను కలిసేందుకు ప్రయత్నించగా ఆయనే వారిని ఆహ్వానించి ఫొటోలు దిగారు. సీఎం జగన్‌ను ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్‌తో పోల్చుతూ చెణుకులు విసరడంతో కార్యకర్తల్లో జోష్ పెరిగింది. బీజేపీతో కలిసి జనసేన, తెలుగుదేశం పార్టీ ఉమ్మడి అభ్యర్థిగా కాలవ శ్రీనివాసులు ను అధిక మెజార్టీతో గెలిపించే బాధ్యత మీదేనని వెల్లడించారు. అనంతరం కాలవ శ్రీనివాసులు నెత్తిపై పార్టీ టోపీ పెట్టి, జేబుకు సైకిల్ గుర్తు అతికించారు. తన తాత ఎన్టీఆర్‌ను సీఎంను చేసి, మామ హరికృష్ణను శాసనసభకు పంపించి, ముద్దుల బాలయ్యను రెండుసార్లు శాసనసభ్యునిగా ఆదరించిన ఈ ఉమ్మడి అనంత జిల్లాపై ప్రత్యేక ప్రేమ ఉందని పేర్కొన్నారు.


అవినీతిపరుడిని సాగనంపి.. అసమర్థుడిని తెచ్చుకున్నారు..

తమ కంటే ఎక్కువ అవినీతి సొమ్ము పోగేస్తున్నాడనే ఈర్ష్యతో ఇక్కడి ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డిని బయటికి పంపి ఓ అసమర్థుడిని తెచ్చిపెట్టాడని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని విమర్శించారు. ఈ అసమర్థుడు ఒక్కసారైనా సీఎం జగన్ దగ్గరకు వెళ్లి మా నియోజకవర్గానికి ఇన్ని సమస్యలున్నాయి, నిధులు కేటాయించాలని అడిగిన దాఖలాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. సమర్థుడైన కాలవ శ్రీనివాసులును అఖండ మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత మీదేనని తెలిపారు. అనంతరం కాలవ శ్రీనివాసులు తెలుగుదేశం పార్టీ శ్రేణులతో ప్రతిజ్ఞ చేయించారు.

బీటీపీ, ఉంతకల్లు రిజర్వాయర్లకు నీరిస్తాం

తాము అధికారంలోకి రాగానే భైరవాన్‌తిప్ప ప్రాజెక్టుకు నీరందించడమే కాకుండా ఉంతకల్లు రిజర్వాయర్‌ను నిర్మిస్తామ ని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. ఆదివారం జరిగిన శంఖారావం సభలో ఆయన మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు తెలుగుదేశం హయాంలో ఎమ్మెల్యేగా ఉన్న కాలవ శ్రీనివాసులు కుప్పం నియోజకవర్గం కంటే అధికంగా ఇక్కడకు నిధులు తెచ్చి అభివృద్ధి చేశారన్నారు. అంతే కాకుండా తాను మంత్రిగా ఉన్న శాఖ నుంచి అత్యధికంగా నిధులు తెచ్చుకున్నారన్నారు. సీసీరోడ్లు, అంగన్‌వాడీ భవనాలు, పంచాయతీ భవనాలులాంటి అనేక కార్యక్రమాలు చేశారన్నారు. కేవలం రాయదుర్గం పట్టణానికి ఇండోర్ స్టేడియం నిర్మాణంతో పాటు రూ.85 కోట్లు మంజూరు చేశామన్నారు. రూ. 44 కోట్ల డ్రిప్ ఇరిగేషన్ కోసం ఖర్చు చేసి రైతులకు లబ్ధి చేకూర్చారన్నారు. హాస్టల్, స్కూల్ భవనాలు, సబ్‌సర్ఫేస్ డ్యాంలతో పాటు రూ.120 కోట్లు ఖర్చు పెట్టి ఎన్టీఆర్ టిడ్కో భవనాల నిర్మాణాలను శ్రీకారం చుట్టామన్నారు. ఐదేళ్ల జగన్ పాలనలో అభివృద్ధిపై చర్చించేందుకు కాలవ శ్రీనివాసులు సిద్ధంగా ఉన్నారని, మీరు సిద్ధమా అని వైసీపీ నాయకులకు సవాల్ విసిరారు.

లోకేశ్ నాయకత్వాన్ని బలపరచాలి: కాలవ



సూపర్ సిక్స్ పథకాలకు సంబంధించిన బ్యాగును కాలవ శ్రీనివాసులుకు అందజేస్తున్న నారా లోకేశ్

ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్న నారా లోకేశ్ నాయకత్వాన్ని బలపరచాలని మాజీ మంత్రి, టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సభలో ఆయన మాట్లాడుతూ రాయదుర్గంలో అఖండమైన మెజార్టీతో తెలుగుదేశం జెండా ఎగురవేయాలన్నారు. పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా లోకేశ్ ఉన్నప్పుడు రాయదుర్గం అభివృద్ధి కోసం చాలా నిధులు మంజూరు చేశారని కొనియాడారు. భైరవాన్‌తిప్ప ప్రాజెక్టుకు రూ. 945 కోట్లు మంజూరు చేసిన ఘనత చంద్రబాబుదన్నారు. మళ్లీ చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకొని ఆ పనులు పూర్తి చేసుకుందామన్నారు. ఆదిశనగా కార్యకర్తలు పని చేయాలన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ మంజునాథ్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని పీడిస్తున్న జగన్‌ను ఓడించడానికి పొత్తులు పెట్టుకోవడం తప్పు కాదన్నారు.

వైసీపీ పాలనకు చరమగీతం పాడండి : నారా లోకేశ్

కణేకల్లు: వైసీపీ పాలనకు చరమగీతం పాడి టీడీపీని అధికారంలోకి తీసుకురావాలని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఉరవకొండ పర్యటన ముగించుకుని కణేకల్లు మీదుగా వెళుతున్న సమయంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు ఆపి పూలమాలలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కొంతమంది కార్యకర్తలు ఈ సారి టీడీపీని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని తెలపగా.. దీనికి నారా లోకేశ్ వైసీపీని పూర్తిగా తుడిచిపెట్టేయాలంటూ చేతి సంజ్ఞలతో వారికి సమాధానమిచ్చారు. అంతకు ముందు మాల్యం వేదవతి హగరిలో ఆయన సెల్ఫీ దిగి అక్కడ ఉన్న కొంతమందితో వేదావతి హగరి గురించి ఆరా తీశారు. కణేకల్లులో టీడీపీ కన్వీనర్ లాలెప్ప, ఆనంద్‌రాజ్, వేలూరు మరియప్ప, బీటీ రమేష్, షేక్‌ముజ్జు, అనిల్, చంద్రశేఖర్‌గుప్తా, హనుమాపురంలో ఎంపీటీసీ నరేంద్ర, సర్పంచ్ జయరాంచౌదరి, కణేకల్లు క్రాసింగ్‌లో ఆది, బాయినేని నవీన్, బసవరాజు, కిష్ట, కోళకుర్తి సుదర్శన్ నారా లోకేశ్‌కు స్వాగతం పలికారు.



నారా లోకేశ్‌కు నాగలి అందజేస్తున్న అమిలినేని సురేంద్రబాబు

బదిలీతో నీతిమంతురాలు అవుతుందా ?

శంఖారావం సభలో మంత్రి ఉష శ్రీ చరణ్‌పై నిప్పులు చెరిగిన లోకేశ్

ఎంపీ రంగయ్యకు ఓటు అడిగే అర్హత లేదని ఉద్ఘాటన

కళ్యాణదుర్గం, మార్చి 10: అవినీతి మంత్రిగా పేరు సంపాదించిన ఉష శ్రీచరణ్‌ను పెనుకొండకు ట్రాన్స్‌ఫర్ చేసినంత మాత్రాన ఆమె నీతిమంతురాలు అవుతుందా అంటూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ప్రశ్నించారు. ఆదివారం కళ్యాణదుర్గం సమీపంలోని గరుడాపురం రోడ్డు సమీపాన ఏర్పాటు చేసిన శంఖారావం సభలో నారా లోకేశ్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మంత్రి ఉష శ్రీ చరణ్, ఎంపీ రంగయ్యపై ఘాటు విమర్శలు చేశారు. గత ఐదేళ్ల పాలనలో అవినీతిలో అగ్రస్థానం ఆమెకు దక్కిందన్నారు. చెరువులు కబ్జా చేసి, అక్రమంగా సంపాదించిన డబ్బుతో 250 ఎకరాలలో రిసార్ట్స్ కడుతున్నారని విమర్శించారు. ప్రజల సొమ్ముతో అత్యంత ఖరీదైన బంగ్లాను నిర్మించుకున్న మంత్రి ఉష శ్రీ చరణ్ అవినీతిలో రికార్డు స్థాయికి ఎక్కిందన్నారు. ఎంపీగా ఉన్న రంగయ్య పార్లమెంటులో రాష్ట్ర అభివృద్ధిపై ఏ మాత్రం చర్చించలేదని, ఒక్క ప్రాజెక్టు తీసుకురాలేదన్నారు. ఎంపీగా పనికిరాని రంగయ్య ఎమ్మెల్యేగా పోటీచేసేందుకు కూడా అనర్హుడంటూ మండిపడ్డారు. ఆయనకు ఓటు అడిగే అర్హత కూడా లేదని పేర్కొన్నారు. మంత్రి ఉష శ్రీచరణ్ అవినీతిపైన ఎంపీ తలారి రంగయ్య పనితీరుపై నారా లోకేశ్ విమర్శలు గుప్పించడంతో శంఖారావం సభ ఈలలు, చప్పట్లతో మార్మోగింది.

బీటీపీ కాలువ పనులు పూర్తి చేస్తాం

పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు

టీడీపీ అధికారంలోకి రాగానే భైరవాన్ తిప్ప ప్రాజెక్టు కాలువ పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. ఆదివారం నిర్వహించిన శంఖారావం సభలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం అన్ని విధాలా వెనుకబడి ఉందన్నారు. ఈ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్లు, పాఠశాలలు, ఆస్పత్రుల ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. దాదాపు 25 వేల మందికిపైగా శంఖారావం సభకు హాజరవడంతో కళ్యాణదుర్గం పసుపుమయంగా మారింది. సురేంద్రబాబు మాట్లాడుతున్న సమయంలో కార్యకర్తలు, అభిమానుల ఈలలు, చప్పట్లతో శంఖారావం సభ మార్మోగిపోయింది. కళ్యాణదుర్గం కంచుకోటలో టీడీపీని అఖండ మెజార్టీతో గెలిపించి చంద్రబాబు, లోకేశ్‌కు కానుకగా ఇస్తామని అమిలినేని సురేంద్రబాబు ప్రకటించారు. జనసేన సమన్వయకర్త బాల్యం రాజేష్ మాట్లాడుతూ.. మంత్రి ఉషశ్రీచరణ్ సహజవనరులను కొల్లగొట్టి బెంగళూరులో దాచుకున్నారన్నారు. లోకేశ్ రెడ్ బుక్‌లో ఈ విషయాన్ని రాసుకుని తిన్నదంతా కక్కించాలని కోరారు.

పోటెత్తిన అభిమానులు, కార్యకర్తలు



కార్యకర్తల ఉత్సాహం

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆదివారం కళ్యాణదుర్గంలో నిర్వహించిన సభకు పార్టీ కార్యకర్తలు, అభిమానులు పోటెత్తారు. పట్టణంలోని ప్రధాన రహదారులు, గరుడాపురం రోడ్డు, ప్రజావేదిక వద్ద తెలుగు తమ్ముళ్లు, మహిళలు, కార్యకర్తలు, ప్రజలతో కిక్కిరిసి పోయాయి. ఎక్కడ చూసినా పసుపు జెండాలే కనిపించాయి. చిన్నారులు సైతం టీడీపీ జెండాను చేతపట్టి జై చంద్రబాబు.. జై నారా లోకేశ్ అంటూ నినాదాలు చేశారు. బ్రహ్మసముద్రం మండలం మాముదూరు గ్రామానికి చెందిన అంధుడు వన్నూరుస్వామి జెండా చేతపట్టి తన అభిమానాన్ని చాటుకున్నాడు.

పెరుగుతున్న డెంగీ బాధితులు

నిర్లక్ష్యం వీడని ఉన్నతాధికారులు





అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మోక్షిత, జాహ్నవి

శింగనమల, మార్చి 10: మండలంలో డెంగీ, వైరల్ జ్వరాల బారిన పడుతున్న చిన్నారులు సంఖ్య రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. ఆదివారం పోతురాజు కాలువ గ్రామానికి చెందిన మోక్షిత, సోదనపల్లికి చెందిన జహ్నవి జ్వరాలతో అనంతపురం పెద్దాసుపత్రిలో చేరారు. ఇప్పటికై అక్కడ సుమారు 15 మంది చిన్నారులు చికిత్స పొందుతున్నారు. ప్రతి రోజూ శింగనమల కమ్యూనిటీ హెల్త్ సెంటర్, తరిమెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పదుల సంఖ్యలతో చిన్నారులు జ్వరాలతో చికిత్స కోసం వస్తున్నారు. అంతేకాకుండా చాలా మంది ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు.

అపరిశుభ్రతే కారణం

మండలంలోని 19 పంచాయతీల్లో అపరిశుభ్రత తొలగించడం లేదు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏనాడూ పంచాయతీలకు పైసా కేటాయించింది లేదని, కేంద్రం ఇచ్చిన నిధులను సైతం ఇవ్వలేదని ఆ పార్టీ సర్పంచులే వాపోతున్నారు. వచ్చిన కొద్దిపాటి నిధులు గ్రామంలో పారిశుధ్య కార్మికుల జీతాలకే సరిపోతుందన్నారు. తమ మీద నమ్మకంతో సర్పంచులుగా ఎన్నుకుంటే చిన్న చిన్న పనులు కూడా చేయలేని పరిస్థితుతో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని ఉన్నతాధికారులు

గత టీడీపీ ప్రభుత్వంలో సీజన్‌వారిగా గ్రామాల్లో ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేసే వారని, అయితే వైసీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నా.. వైద్య ఉన్నతాధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. 20 రోజుల నుంచి డెంగీ, వైరల్ జర్వాలతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నా.. ఎక్కడ వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గ్యాస్ సిలిండర్ లీకై నలుగురికి గాయాలు

గాయపడిన వారిలో అవ్వ, మనవడు, మనవరాళ్లు

ఉలిక్కిపడ్డ కాలనీ

హిందూపురం, మార్చి 10 : పట్టణంలోని బ్యాంక్ కాలనీలో ఆదివారం ఓ ఇంట్లో ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ లీకై ఓ వృద్ధురాలు, ఆమె ఇద్దరు మనుమరాళ్లు, మనవడికి గాయాలయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల మేరకు వివరాలిలా ఉన్నా యి. బ్యాంక్ కాలనీలో ఆనందప్ప, లక్ష్మీదేవి అనే వృద్ధులు ఓ రేకుల షెడ్డులో నివాస ముంటున్నారు. వారి కుమారుడు, కుమార్తె కుటుంబాలతో పక్కనే వేర్వేరుగా నివాస ముంటున్నారు. లక్ష్మీదేవి ఆదివారం ఉదయం గ్యాస్ స్టవ్‌పై టీ తయారుచేసింది. గ్యాస్ ఆఫ్ చేయడం మరిచిపోయింది. టీ తాగిన తరవాత వారిద్దరు బయట కు వెళ్లి పోయారు. కొంతసేపటి తరువాత ఆమె తన కుమార్తె కొడుకు, తన కుమారుడి ఇద్దరు కూతుళ్లతో కలిసి షెడ్‌లోకి వెళ్లింది. షెడ్‌లో గ్యాస్ వాసన వస్తుండడం వారు గమనించారు. వెంటనే లైటుస్విచ్ ఆన్‌చేశారు. దీంతో ఒక్కసారిగా పెద్ద శబ్దం వచ్చింది. షెడ్డుకున్న రేకులు పైకి లేచాయి. ఇంటి తలుపులు బద్దలై కిందపడ్డాయి. స్థానికులు వెంటనే గమనించి ఆ ఇంట్లోకి వెళ్లారు. లోపల లక్ష్మీదేవమ్మతోపాటు ఆమె మనవరాళ్లు అఖిల, వర్షిత, మనువడు భరత్ గాయాలతో కనిపించారు. వెంటనే వారిని బయటకు తీసుకొచ్చి స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి, చికిత్సలు అందించారు. లక్ష్మీదేవికి తీవ్రగాయాలుకాగా మనువడు, మనువరాళ్లు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ మద్యం దుకాణంలో చోరీ

భారీగా నగదు, మద్యాన్ని ఎత్తుకెళ్లిన దొంగలు

బత్తలపల్లి, మార్చి10: ప్రభుత్వ మద్యం దుకాణంలో భారీగా నగదు, మద్యం చోరీ జరిగింది. ఈ ఘటన బత్తలపల్లి మండలకేంద్రంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ అరోహణరావు ఎక్సైజ్ సీఐ గౌరీప్రియ ఘటనా స్థలాన్ని ఆదివారం ఉదయం పరిశీలించారు. గుర్తు తెలియని దుండగులు ఓ కారులో వచ్చి మద్యం దుకాణం తలుపులను పగుల కొట్టి లోపలకు ప్రవేశించి, అందులోని 5 సీసీ కెమెరాలను ధ్వంసం చేసి హార్డ్‌డిస్క్‌ను ఎత్తికెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. అలాగే లాకర్‌ను పగులకొట్టి రూ.10లక్షలకుపైగా నగదు, రూ.3లక్షల విలువజేసే మద్యం బాటిళ్లను ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. పోలీస్ అధికారులు క్లూస్ టీంను పిలిపించి ఆధారాలు సేకరించారు. సూపర్‌వైజర్ విజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



చోరీ జరిగిన మద్యం దుకాణాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ తదితరులు

వడదెబ్బతో వ్యక్తి మృతి



ఓబులేసు (ఫైల్)

పామిడి, మార్చి 10: మండల కేంద్రంలో ఓబులేసు(48) అనే వ్యక్తి వడదెబ్బతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మండలంలోని పొగరూరు గ్రామానికి చెందిన ఓబులేసు పామిడిలోనే స్థిరపడ్డాడు. 44వ జాతీయ రహదారిపై పండ్లు అమ్ముకుంటూ, కూలి పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. రోజు మాదిరే పనులు ముగించుకొని ద్విచక్రవాహనంపై బయటకు వెళ్లాడు. ఎండతీవ్రతకు పామిడి రైల్వేస్టేషన్ వద్ద సొమ్మసిల్లిపడిపోయాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు హుటాహుటిన అతనిని పామిడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య గోవిందమ్మ, కుమారుడు వంశీకృష్ణ ఉన్నారు. పెద్ద దిక్కును కోల్పోయిన ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జీఎస్ఐ కేంద్రంలో స్ట్రాటిగ్రాఫిక్ నమూనా ఏర్పాటు

గుంతకల్లు (వజ్రకరూరు), మార్చి 10: వజ్రకరూరులోని జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) వజ్రాల పరిక్రమణ (ప్రాసెసింగ్) కేంద్రంలో భూగర్భ ధాతువులను ప్రతిబింబించే (స్ట్రాటిగ్రాఫిక్) రాతి నమూనాల కట్టడాన్ని ఏర్పాటుచేశారు. ఆదివారం ఉదయం జీఎస్ఐ దక్షిణ ప్రాంత ఏడీజీ సీహెచ్ వెంకటేశ్వర రావు, ఏపీఎస్‌యూ డిప్యూటీ జనరల్ ఎస్ఎన్ మహాపాత్రో ఆధ్వర్యంలో నమూనా నిర్మాణాన్ని ఆవిష్కరించారు. వీరు మాట్లాడుతూ భూగర్భ ధాతువుల ప్రాథమిక దశను వివరించగలిగే చారిత్రక ప్రాంతంగా (ప్రోటిరోజోయిక్ బేసిన్), దేశంలో రెండవదిగా పేరు గాంచిన కడప బేసిన్‌లోని రాతి నమూనాలను ఈ కట్టడంలో నిక్షిప్తం చేసినట్లు తెలిపారు. వజ్రకరూరులోని జీఎస్ఐ వజ్రాల ప్రాసెసింగ్ కేంద్రంలో ఈ స్ట్రాటిగాఫ్రిక్ కాలంను ఏర్పాటుచేయడం ద్వారా భౌగోళిక శాస్త్ర ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు ఎంతో ఉపకరిస్తుందన్నారు. స్థానిక విద్యార్థులకు ఈ స్ట్రాటిగ్రాఫిక్ నిర్మాణాన్ని చూపారు. వారికి విషయావగాహన కల్పించారు. కార్యక్రమంలో జీఎస్ఐ అధికారులు డాక్టర్ అపూర్వ బెనర్జీ, రాకుశ్ కుమార్ గుప్త, తరుణ్ కోలే, శ్రీపాద బాల్, సుమన మండల్, ఏపీ సహాయ జియాలజిస్టు పీ హరికృష్ణ పాల్గొన్నారు.

నారాలోకేశ్‌కు ఘన స్వాగతం


నారాలోకేశ్‌తో వైకుంఠం ప్రభాకర్ చౌదరి, మధుకర్ చౌదరి

అనంతపురం అర్బన్, మార్చి 10: స్థానిక పీవీకేకే కళాశాల ప్రాంగణంలోని శంఖారావం శిబిరం వద్దకు ఆదివారం రాత్రి చేరుకున్న నారాలోకేశ్‌కు మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి, ఆయన తనయుడు వైకుంఠం మధుకర్ చౌదరి స్వాగతం పలికారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో శంఖారావం సభను ముగించుకొనిఆయన అనంతపురానికి చేరుకున్నారు.

నేడు శంఖారావం సభకు తరలిరండి

అనంతపురంలో నారాలోకేశ్ సోమవారం చేపట్టే శంఖారావం సభకు పెద్దఎత్తున టీడీపీ శ్రేణులు, ప్రజలు తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు అనంతపురం అర్బన్ నియోజకవర్గానికి సంబంధించి శంఖారావం సభను ఆలమూరు రోడ్డులోని పీవీకేకే కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. టీడీపీ సెక్యూలర్ పార్టీ అని, రాష్ట్ర అభివృద్ధి, శ్రేయస్సు కోసం బీజేపీతో పొత్తు పెట్టుకోవడం జరిగిందని అన్నారు. మైనార్టీలకు టీడీపీ ఎప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. పొత్తులో భాగంగా అనంతపురం అర్బన్ సీటును ఎవరికి ఇవ్వాల నేది తన అధినేత ఇంకా నిర్ణయించలేదని భావిస్తున్నా నన్నారు. శంఖారావం తర్వాత చంద్రబాబు నుంచి పిలుపు వస్తే వెళ్లి వాస్తవ పరిస్థితులను తమ అధినేత దృష్టికి తీసుకువెళతామన్నారు. టీడీపీ, జనసే న పొత్తు పెట్టుకున్న సమయంలో విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధా నంగా అప్పట్లో పవన్ కళ్యాణ్ అనంత అర్బన్ నుంచి పోటీ చేస్తే తన భుజస్తంధాలపై వేసుకొని గెలిపిస్తామని చెప్పానన్నారు. ఆ మాటకు ఇప్పటికీ కట్టుబడి ఉన్నాన న్నారు. దీన్ని కొందరు వక్రీకరించి మాట్లాడుతున్నారని, త్వరలో వారందరీ అకౌంట్లు సెటిల్ చేస్తానన్నారు. తరిమెల నాగిరెడ్డిని ఆదర్శంగా తీసుకొని రాజకీయాలు చేస్తున్నానని, ఏ విషయానైనా నిక్కచ్చిగా. నిర్భయంగా చెప్పే ధృక్పథం తనదని అన్నారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్షలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 10: అంబేడ్కర్ గురుకులాల్లో 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి నిర్వహించిన 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు అంబేడ్కర్ గురుకులాల ఉమ్మడి అనంత జిల్లా కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ తెలిపారు. ఆదివారం జిల్లాలోని పలు గురుకులాల పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. మొత్తం 16 పరీక్షా కేంద్రాల్లో 5వ తరగతి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించామన్నారు. 480 సీట్లకుగానూ 10,234 మంది దరఖాస్తు చేసుకోగా... 9,395 మంది పరీక్షకు హాజరయ్యారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి సంబంధించి 1,200 సీట్లకు 5,596 మంది దరఖాస్తు చేసుకోగా... 4,785 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారన్నారు.

పశువుల సంత ఆదాయం రూ.2.99 లక్షలు

అనంతపురంరూరల్,మార్చి 10: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశువుల సంతతో మార్కెట్‌కు రూ.2,99,120 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా మార్కెట్‌కు రూ.1,55,050, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,44,070 ఆదాయం వచ్చిందని తెలిపారు.

పూర్తిస్థాయి ప్రజాక్షేత్రంలో ఉండండి

ఎన్నికల ప్రచారాన్ని వేగవంతం చేయండి : పార్టీ శ్రేణులకు మాజీ మంత్రి పరిటాల సునీత పిలుపు

అనంతపురంరూరల్, మార్చి 10: ఎన్నికలు ఎంతో దూరం లేవని, నాయకులు, కార్యకర్తలు ఇక నుంచి ప్రజాక్షేత్రంలో పూర్తిస్థాయిలో ఉండాలని మాజీ మంత్రి పరిటాల సునీత పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని అరవిం ద్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆమె మండలంలోని పాపంపేట, కక్కలపల్లి కాలనీ పంచాయతీ పరిధిలోని నాయ కులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే సోదరుల వలన వైసీపీ నాయకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, వారందరూ టీడీపీలోకి రావాలనే ఆలోచనతో ఉన్నార ని, అలాంటివారికి ధైర్యం చెప్పి పార్టీలోకి తీసుకుని రావాలని సూచించారు. పార్టీలోకి వచ్చిన ప్రతి నాయకుడికి సముచిత స్థానం ఉంటుందని, అలాగే పాతవారికి ఎలాంటి ఇబ్బంది ఉండబోదన్న భరోసా ఇవ్వాలని అన్నా రు. కార్యక్రమంలో మండ ల కన్వీనర్ జింకా సూర్యనారాయణ, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, మండల ప్రధాన కార్యదర్శి పాముదాయి రఘు, క్లస్టర్ ఇన్‌చార్జ్ మురళీ పాల్గొన్నారు.

టీడీపీ ప్రచారంపై సమీక్ష

రామగిరి : మండలంలో సూపర్ సిక్స్, శంఖారావం ప్రచార కార్యక్రమాలపై మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఆదివారం వెంకటాపురంలో మాజీ మంత్రి పరిటాల సునీత, ఆమె తనయుడు పరిటాల సిద్దార్థ సమీక్ష నిర్వహించారు. ఈ నెల 11 నుంచి 25వ వరకు పలు గ్రామాల్లో ఈ ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో అందరు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకులు ఎల్ నారాయణచౌదరి, రామ్మూర్తినాయుడు, మండల కన్వీనర్ సుధాకర్, పరందామ యాదవ్, శివకుమార్, దుబ్బార్లపల్లి వెంకటేశ్, మాజీ కన్వీనర్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

టీడీపీలోకి వైసీపీ నాయకుడు చేరిక: మండలంలోని ఎంసీపల్లి పంచాయతీ గరిమేకలపల్లికి చెందిన న్యాయవాది, వైసీపీ నాయకుడు సుబ్రహ్మణ్యం టీడీపీలోకి చేరారు. కార్యక్రమంలో నాయకులు ముత్యాలు, ఆదిశేషు పాల్గొన్నారు.


వెంకటాపురంలో సమీక్ష నిర్వహిస్తున్న పరిటాల సునీత, పరిటాల సిద్ధార్థ

కంటివైద్యశిబిరం విజయవంతం


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నవైద్యులు, పాల్గొన్న సంఘం నాయకుడు రమేష్


అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 10: స్థానిక మున్నానగర్‌లో రాయలసీమ బలిజ యువజన సంఘం అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. కర్నూలులోని శాంతి రామ్ కంటి ఆస్పత్రి వారి సౌజన్యంతో దీన్ని నిర్వహించారు. రమేష్ మాట్లాడు తూ.. సంఘం ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ కంటి వైద్యశిబిరం ద్వారా దాదాపు 600 మంది పరీక్షలు చేయించుకున్నారని, అందులో 72 మందికి కళ్లద్దాలు, మందులు పంపిణీ చేశామని అన్నారు. మరో 42 మందిని ఆపరేషన్ల నిమిత్తం కర్నూలులోని శాంతిరామ్ ఆస్పత్రికి పంపించడం జరిగిందన్నారు. ఆ ఆపరేషన్‌తో పాటు వసతి అన్ని ఖర్చులు తామే భరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు చిన్నయ్య, శేఖర్, నాగార్జున, సంఘం నాయకులు బళ్లారి వెంకటరాముడు, పావురాల శేఖర్, కోనేటి సాయిప్రసాద్, బోయ రవి, నాగేంద్ర, కడియాల పకృద్దీన్, నిజాం, వెంకటేష్, షౌకత్, మణి, సుధ, వినోద్, రేవంత్, దినేష్, వేణు, గిరి, సురేష్, రమేష్, వినయ్, సుదర్శన్ పాల్గొన్నారు.

శంఖారావం సభను జయప్రదం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ పవన్‌రెడ్డి

అనంతపురం అర్బన్, మార్చి 10: అనంతపురంలో నారాలోకేశ్ చేపట్టే శంఖారావం సభను జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులకు టీడీపీ అనంతపురం పార్లమెంట్ ఇన్‌చార్జి జేసీ పవన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎంవైఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆయన నాయకులు, కార్యకర్తలతో సమావేశమ య్యారు. అనంతరం ఉరవకొండలో నిర్వహించిన శంఖారావం సభకు భారీ కాన్వాయ్‌తో పార్టీ శ్రేణులతో కలిసి హాజరయ్యారు. సభ వద్ద శిబిరంలో నారాలోకేశ్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. వారి వెంట నాయకులు రాయల్ మురళీ, లక్ష్మీనరసింహ, రమేష్, లింగారెడ్డి, కృష్ణకుమార్, శ్రీనివాస్‌రెడ్డి, శేషానందరెడ్డి, రామకృష్ణారెడ్డి ఉన్నారు.

అంతర్జాతీయ టెన్నిస్ బాల్ క్రికెట్‌కు కల్లూరు వాసి


రాజశేఖర్

గార్లదిన్నె, మార్చి 10: అంతర్జాతీయ టెన్నిస్ క్రికెట్ పోటీలకు గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామానికి చెందిన కొమ్మల రాజశేఖర్ ఎంపికయ్యాడు. తమిళనాడు లోని రామనాథపురంలో ఫిబ్రవరి 2, 5 తేదీల్లో జరిగిన జాతీయ స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీల్లో రాజశేఖర్ ప్రతిభ కనబరిచాడని టెన్నిస్ బాల్ క్రికెట్ జిల్లా కార్యదర్శి అంజనేయులు తెలిపారు. రాజశేఖర్ రాష్ట్ర స్థాయి నుంచి ఇంటర్‌నేషనల్ పోటీలకు ఎంపిక కావడంతో అతన్ని ఆదివారం పలువురు సన్మానించి, అభినందించారు. మేలో బ్యాంకాక్, థాయిలాండ్‌లో జరిగే టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీల్లో అతను పాల్గొంటాడు.

ముస్లింలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

అనంతపురం కల్చరల్, మార్చి 10 : సార్వత్రిక ఎన్నికల్లో ముస్లింలకు సీట్లు కేటాయించాలని మౌలానా హమీద్ హుస్సేన్ పేర్కొన్నారు. జమియత్ ఏ ఉలమా ఇ హింద్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్యారడైజ్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మౌలానా నిజాముద్దీన్, హాఫిజ్ గులాం రసూల్, హాఫిజ్ గౌస్‌పీర్, జాఫర్, నిజాం, హెల్పింగ్ హ్యాండ్స్ షబ్బీర్, టీడీపీ నాయకుడు ఫిరోజ్ పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 10: స్థానిక ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో ప్రథమ చికిత్సపై మూడు రోజుల పాటు నిర్వహించే అవగాహన సదస్సును ప్రారంభించారు. మొదట రెడ్‌క్రాస్ సొసైటీ వ్యవస్థాపకుడు హెన్రీ డునాండ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి మోహన్‌కృష్ణ మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరూ ప్రథమ చికిత్సపై కనీస అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత భరత్, మానసిక వైద్యనిపుణుడు గరుగు బాలాజీ, అర్బన్‌బ్యాంకు డైరెక్టర్ రమేష్ సుంకర, ట్రైనర్ కృష్ణవేణి, సభ్యులు నందిత, అలేఖ్య, షేక్ చాందిని, శేషాద్రి, శీను, ముత్యాలమ్మ, కీర్తి, రాజా పాల్గొన్నారు.

అపరిశుభ్ర ప్రాంతాల్లో మందు పిచికారీ

శింగనమల, మార్చి 10: శింగనమలలో పంచాయతీరాజ్ అధికారులు, మెడికల్ సిబ్బంది సయుక్తంగా అపరిశుభ్రత ప్రాంతాల్లో మందును ఆదివారం పిచికారి చేశారు. గ్రామాల్లో అపరిశుభ్రత వల్ల డెంగీ, విష జ్వరాలు వస్తున్నాయి. దీనిపై శనివారం ఆంధ్రజ్యోతి ఓ కథకాన్ని ప్రచురించడంతో అధికారులు స్పందించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి రామాంజినేయులు, సీహెచ్‌ఓ గంగాధర్, పర్యవేక్షకులు అశ్వర్థనారాయణ గ్రామంలో అపరిశుభ్రత ప్రాంతాల్లో అబెట్ మందును పిచికారి చేశారు. గ్రామంలో నీరు నిల్వ ఉన్న డమ్ములు, తొట్టెలను తొలగించారు. బోయవీధి, గొల్లవీధి గ్రామాల్లో ఇంటింటి సర్వే చేశారు.

వ్యక్తిపై వేట కొడవలితో దాడి

నార్పల : నార్పల క్రాసింగ్ వద్ద ఉన్న వేరుశనగ కాయల మిల్లు వద్ద చెన్నంపల్లి గ్రామానికి చెందిన నాగిరెడ్డిపై నార్పలకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం వేట కొడవలితో దాడి చేశాడు. నాగిరెడ్డి వేరుశనగ కాయల వ్యాపారం చేసేవాడు. ఈ నేపథ్యంలో ఆదివారం నాగిరెడ్డిపై చంద్రశేఖర్‌రెడ్డి వేట కొడవలితో దాడి చేయడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని స్థానికులు 108 వాహనం ద్వారా అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దాడికి కారణాలు తెలియాల్సి ఉందని, కేసు దర్యాప్తులో ఉందని ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

వైసీపీ నేత భూకబ్జాపై బాధితుడి ఆవేదన


శంకర్‌రెడ్డి భూమిలోని గోడను నిర్మిస్తున్న దృశ్యం, బాధితుడు శంకర్‌రెడ్డి (ఇన్‌సెట్లో)

అనంతపురం ప్రెస్‌క్లబ్ / ఆత్మకూరు, మార్చి 10: ఆత్మకూరు మండలం వడ్డుపల్లి పంచాయతీ.. తలుపూరు గ్రామ పొలం సర్వే నెంబరు 203/2సిలో తనకు 1.50 ఎకరాలు భూమి ఉందని, అందులో 20 సెంట్లను అదే గ్రామానికి చెందిన ఓ వైసీపీ నేత కబ్జాకు యత్నిస్తున్నాడని బాధితుడు శంకర్‌రెడ్డి వాపోతున్నారు. ఆదివారం అతను అనంతపురంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడు తూ.. తన భూమిలో దౌర్జన్యంగా గోడ నిర్మిస్తున్నాడని, అడిగితే బెదిరింపులకు పాల్పడ్డాడని చెప్పారు. దీనిపై స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా.. ఆ స్థలంలో నిర్మాణాలు ఆపాలని ఆదేశించారని, అయినా వైసీపీ నేత ఆ ఆదేశాలను ధిక్కరించి.. గోడను నిర్మిస్తున్నాడని వాపోయాడు. దీనిపై స్థానిక పోలీసులు, ఎమ్మార్వో, ఆర్డీఓ కార్యాలయాలు అన్ని చోట్లా తిరిగినా పట్టించుకునే నాథుడే కరువయ్యారన్నారు. జిల్లా అధికారులు స్పందించి వైసీపీ నేత కబ్జాను అడ్డుకొని.. తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశాడు.

రియా ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి ఉదయ్‌కుమార్

గార్లదిన్నె, మార్చి 10: కోటంక సుబ్రహ్మణ్యే శ్వర స్వామి తిరునాళ్ల సందర్భంగా ఆలయ ఆవరణంలో ఆదివారం రియా ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిం చారు. వైద్యాధికారి ఉదయ్ కుమార్ మాట్లాడుతూ... తిరునాళ్లకు వచ్చిన వారికి బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు చేసి.. ఉచితంగా మందులు పంపిణీ చేశామ న్నారు. కార్యక్రమంలో రియా ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ మోదుపల్లి లక్ష్మీప్ర సాద్, ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్లు సుబ్బిరెడ్డి, తాతిరెడ్డి పాల్గొన్నారు.

రామగిరిలో పోలీసు కవాతు

రామగిరి, మార్చి 10: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ముందస్తుగా రామగిరిలో ఆదివారం పోలీసులు కవాతు నిర్వహించారు. ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బీఎస్ఎఫ్ పోలీసులతో కలిసి రామగిరిలోని పురవీధుల్లో కవాతు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అనంతపురం క్రైం, మార్చి 10 : నగరంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపురం రూరల్ మండలం మాయావతి కాలనీకి చెందిన గొల్ల మల్లయ్య (42) మరణించాడు. తన మిత్రులతో కలిసి బైక్‌లో వెళ్తుండగా.. బళ్లారి బైపాస్ సమీపంలో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొన్నాడు. ఈ ఘటనలో మల్లయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు నీటి సరఫరా బంద్

అనంతపురం క్రైం, మార్చి 10 : జల్లిపల్లి టోల్‌గేట్ సమీపంలో పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతుల కారణంగా నగర పరిధిలో సోమవారం తాగునీటి సరఫరాను బంద్ చేస్తున్నట్లు నగరపాలిక ఎస్ఈ రామమోహన్‌రెడ్డి తెలిపారు. నగర ప్రజలకు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తామని, ప్రజలు సహకరించాలని కోరారు.

దళితులపై పగబట్టిన జగన్‌రెడ్డి

అనంతపురం సెంట్రల్, మార్చి 10: రాష్ట్ర ముఖ్యమంత్రిగా దళితుల సంక్షేమాన్ని ఆకాంక్షించాల్సిన జగన్‌రెడ్డి.. వారిపై పగబట్టి భూములను, ఆస్తులను ఆక్రమించుకుంటూ దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని దళిత సంఘాల నాయకులు మండిపడ్డారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద చేపట్టిన నిరసనలో ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి మాట్లాడారు. ఈ ఐదేళ్లలో దళితుల శ్మశాన వాటికలు, ఇళ్లస్థలాలు, పొలాలు ఆక్రమించుకున జగన్‌రెడ్డి ఇప్పుడు హాస్టల్స్ స్థలాలపై పడ్డారని మండిపడ్డారు. చదువుకునే వారికి వసతిని కల్పించేందుకు ఉరవకొండలో ఏర్పాటు చేసిన హరిజన హాస్టల్స్ స్థలలాను ఏకకంగా వైసీపీ నాయకులు, కార్యకర్తల పేరుతో ఆన్‌లైన్ ఎక్కించారన్నారు. ప్రభుత్వ అధికారులను అడ్డగోలుగా వినియోగించుకుంటున్న జగన్‌రెడ్డి ఆన్‌లైన్‌లో భూమోసాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. జగన్‌రెడ్డి తీరును నిరసిస్తూ సోమవారం కలెక్టరేట్ వద్ద చేపట్టే వంటావార్పును విజయవంతం చేసి దళితులకు అండగా నివాలని ప్రజాసంఘాలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు నారాయణస్వామి, రాజు, రమేష్, శంకర్, ఇర్ఫాన్, లాలెప్ప, గోవిందు, రామకృష్ణ, ఓబులేసు, శ్రీనివాస్ పాల్గొన్నారు.


సీఎం జగన్‌పై మండిపడుతున్న నాయకులు

ముగిసిన కోటంక తిరునాళ్ల



గార్లదిన్నె, మార్చి 10: కోటంక శ్రీ గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి తిరునాళ ఆదివారంతో ముగిశాయి. స్వామివారి తిరునాళ్లు ఏటా మాఘం మాసంలో అన్ని ఆదివారాలూ వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది ఐదు ఆదివారాలు పాటు స్వామివారి తిరునాళ్లు జరిగాయి. చివరి ఆదివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజామునే స్వామివారికి రుద్రభిషేకం, నాగదోష నివారణ హోమం తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి మంగళహారతి ఇచ్చి, భక్తులకు స్వామి దర్శన భాగ్యం కల్పించారు. అదేవిధంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం ఆవరణంలోని 108 శివలింగాలను, సాయిబాబా, 35 ఎత్తు అడుగుల గల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, 9 అడుగులు ఎత్తు నంది విగ్రహం, 10 అడుగులు నాగల పడగ విగ్రహాలను దర్శించుకున్నారు. ఆలయ ఆవరణం భక్తులతో కిటకిటలాడింది. మాజీ జడ్పీటీసీ విశాలాక్షి, విజయ్‌భాస్కర్ దంపతులు, ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్ తాతిరెడ్డి, ఆలయ ఈఓ బాబు. మాజీ సర్పంచు సుబ్రహ్మణ్యం తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. విజయ్‌భాస్కర్ దంపతుల ఆధ్వర్యంలో ప్రసాద సంతర్పణ జరిగింది. ఈ తిరునాళ్ల సందర్భంగా ఆలయం ఆవరణంలో రియా హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

అశ్వవాహనంపై ఊరేగిన కాశీవిశ్వేశ్వరుడు



అనంతపురం కల్చరల్, మార్చి 10: స్థానిక మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పదో రోజున ఆదివారం కాశీవిశ్వేశ్వరుడు అశ్వవాహన దారుడై ఊరేగాడు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమేష్‌బాబు, అనువంశీకుడు హోసూరు రామసుబ్రహ్మణ్యం, ధర్మకర్తల మండలి సభ్యులు కల్పన, రాజేశ్వరి, వెంకటస్వామి, సురేష్‌బాబు, తిమ్మారెడ్డి, చంద్రశేఖర్, డి.సుబ్రహ్మణ్యం, ప్రధానార్చ కుడు నరసింహ శాస్త్రి, పరమేష్, భక్తులు పాల్గొన్నారు. కాగా, ఈ ఈనెల 1 నుంచి నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగియనున్నాయి. సోమవారం రాత్రి 8.30 గంటలకు స్వామివారి శయనోత్సవ సేవతో బ్రహ్మోత్సవాలు సంపూర్ణం అవుతాయి.

పెద్దమ్మ దేవతకు విశేష పూజలు



అనంతపురం కల్చరల్, మార్చి 10: మాఘ మాసం ముగింపును పురస్కరించుకుని ఆదివారం నవయుగ కాలనీలోని పెద్దమ్మ దేవాలయంలో విశేష పూజలు నిర్వహిం చారు. అమ్మవారి మూలవిరాట్‌కు వివిధ అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణం చేశారు.. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు రాజు, కమిటీ సభ్యులు హనుమంతు, హరి, జాఫర్, పీరా, భూలక్ష్మి, సహీన, వెంకటేష్, భారతి పాల్గొన్నారు.

వైభవంగా చితంబరప్ప స్వామి తిరునాళ్ల



గార్లదిన్నె, మార్చి 10: మండలంలోని పెనకచెర్ల గ్రామంలో ఆదివారం వైభవంగా అవధూత చితంబరప్పస్వామి తిరునాళ్ళు నిర్వహించారు. ఏటా మహాశివరాత్రి పండగ అనం తరంతః తిరునాళ్లను ఘనంగా నిర్వహిస్తారు. శనివారం రాత్రి స్వామివారిని రథంలో ఉంచి.. పురవీధుల్లో ఊరేగించారు. ఆదివారం ఉదయం స్వామివారి తిరునాళ్ల నిర్వహించారు.

టీడీపీ ఇంటింటి ప్రచారం

ఆత్మకూరు మార్చి 10: మండలంలోని సింగంపల్లి తండా, వై కొత్తపల్లి గ్రామాల్లో ఆదివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీలో భాగంగా టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇందులో టీడీపీ మండల ఇన్‌చార్జి బాలాజి, మండల కన్వీనర్ శ్రీనివాసులు, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్మవరంరూరల్ : కనగానపల్లి మండలంలోని తూముచెర్ల, సీఎన్ కోట గ్రామాల్లో టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేష్, మండల కన్వీనర్ యాతం పోతలయ్య, తెలుగు యువత బట్టా సురేష్ చౌదరి, బిల్లే దామోదర్, తూముచెర్ల హరి, నరసప్ప, చెన్నప్ప, మల్లికార్జున, నాగభూషణ, ఆదెప్ప పాల్గొన్నారు.



వై కొత్తపల్లి, తూముచెర్లలో టీడీపీ నాయకులు, కార్యకర్తల ప్రచారం

ఉచితంగా ఫ్రీజర్ బాక్స్ సేవలు


చంద్రకాంత్‌నాయుడిని అభినందిస్తున్న ప్రముఖులు

అనంతపురం టౌన్, మార్చి 10: మృతదేహాలను ఉంచుకునేందుకు ఫ్రీజర్ బాక్స్ సేవలను ఉచితంగా అందిస్తున్నట్లు అనంతపూర్ సర్కిల్ భాగస్వామి సుంకర చంద్రకాంత్‌నాయుడు ఆదివారం తెలిపారు. తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం వీటిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే రెండు అందుబాటులో ఉన్నాయని, వీటితో పాటు మరో రెండు... మొత్తం నాలుగు ఫ్రీజర్లు ఇక నుంచి అందుబాటులో ఉంటాయని తెలిపారు. నగర ప్రజలు ఉచితంగా వీటిని వినియోగించుకోవచ్చని, అవసరమైన వారు 94400 44700, 92477 92567 సెల్ నెంబర్లను సంప్రదిం చాలని సూచించారు. ఈ సందర్భంగా చంద్రకాంత్ నాయుడిని పలువురు అభినందించారు.

కిడ్నీ చికిత్సకు 'అమ్మ' సాయం


చెక్కును అందజేస్తున్న రమణారెడ్డి

అనంతపురం కల్చరల్, మార్చి 10 : పాతూరులో నివాసముండే అలివేలమ్మ ఇళ్లల్లో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఆమె కిడ్నీలు చెడిపోవడంతో వాటికి ఆపరేషన్ చేయడా నికి రూ. 8 లక్షలు అవుతుందని బెంగుళూరు సెయింట్ జాన్స్ హాస్పిటల్ వైద్యులు తెలిపారు. ఈ క్రమంలో అమ్మ సంస్థను ఆమె ఆదివారం సంప్ర దించగా ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు తరి మెల రమణారెడ్డి రూ.2 లక్షల చెక్కును బాధితురాలికి అందజేశారు. మిగిలిన సొమ్మును కూడా దాతల సహకారంతో సమకూరుస్తానని హామీ ఇచ్చారు.

రామాలయం అభివృద్ధికి...



రాప్తాడు: ప్రసన్నాయపల్లి పంచా యతీ చిన్మయ్‌నగర్ మెయిన్ రోడ్డులోని రామాల యానికి టీడీపీ నాయకు డు ఉప్పర శ్రీనివాసులు రూ. 25 వేలు విరాళం అందచేశారు. ఆదివారం చిన్మయ్ నగర్‌లో ఆలయ పెద్దలు వెంకటనారాయణ చౌదరి, వెంకట రాముడు, వెంకటరామిరెడ్డికి ఆ నగదు అందచేశారు.

పేదింటి వివాహానికి ..

అనంతపురం కల్చరల్ : సోములదొడ్డి గ్రామానికి చెందిన సుంకన్న, నాగమ్మ దంపతుల కుమార్తె వివాహ ఆర్థిక సాయం కోసం నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టును ఆశ్రయించారు. ఆదివారం ఆదర్శనగర్‌లోని ఆ ట్రస్టు కార్యాలయంలో ట్రస్టు ఛైర్‌పర్సన్ నిర్మలామురళి సమక్షంలో పీవీకేకే కళాశాల ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు, కళావతి ఆ కుటుంబానికి రూ.3 వేలు ఆర్థికసాయంతో పాటు వివాహానికి అవసరమయ్యే 26 రకాల నిత్యావసర సరుకులు, పెళ్లికుమార్తెకు చీర, గాజులు వితరణ చేశారు.

విద్యార్థి, క్రీడాకారుడికి...

అనంతపురం ప్రెస్‌క్లబ్ : జిల్లా ఈడిగ సంఘం అధ్యక్షుడు బొమ్మగౌని కిరణ్ గౌడ్ నగరంలోని తన స్వగృహంలో ఆదివారం పలువురికి ఆర్థికసాయం చేశాడు. కడప రిమ్స్‌లో మెడిసిన్ మూడో సంవత్సరం చదువుతున్న మంజునాథ్ గౌడ్‌కు రూ. 60 వేల అందజేశారు. అదే విధంగా మోహన్ కృష్ణ అనే దివ్యాంగులు ఈత పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపిక కావడంతో అతడి రవాణా ఖర్చుల కోసం రూ. 15 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసగౌడ్, కోశాధికారి వెంకటేశ్వర్లు, మారుతి గౌడ్, టీచర్ నాగభూషణం, జయచంద్రగౌడ్, రాముగౌడ్, శివ, మల్లికార్జున పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాల్సిందే

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 10: రజకులను ఎస్సీ జాబితాలోకి చేర్చాల్సిందేనని రజక సంఘాల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆ సమితి రాష్ట్ర కన్వీనర్ దేవేంద్రప్ప, కో-కన్వీనర్, న్యాయవాది హనుమన్నలు జిల్లా పరిషత్ అతిథి గృహంలో మీడియతో మాట్లాడారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 15 లక్షల మంది రజకులు ఉన్నప్పటికీ.. రాజకీయంగా ఏ పార్టీ అవకాశం కల్పించకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో సమితి గౌరవ సలహాదారులు నాగేశ్వరరావు, కో-కన్వీనర్లు లింగాల నాగేంద్రబాబు, చంద్రశేఖర్, ఆర్‌పీఎస్ఎస్ శ్రీరాములు, నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఓబులేసు, మహిళా నాయకురాలు ప్రసన్నలక్ష్మి, సీపీఐఎంఎల్ లింగప్ప, రామాంజనేయులు, టీడీపీ నాయకులు వెంకటేష్, ముష్టూరు సుధాకర్, కసాపురం ఆంజనేయులు, హరికృష్ణ, నరసింహులు, శివానంద, అంజి పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇవ్వండి : ఎస్పీ

అనంతపురం క్రైం, మార్చి 10: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని రౌడీషీటర్లను పోలీస్‌స్టేషన్లకు పిలిపించి పోలీసులు కౌన్సెలింగ్ చేపట్టాలని ఎస్పీ అన్బురాజన్ ఒక ప్రకటనలో ఆదేశించారు. వారు ఏ చెడు పని చేసినా పోలీసులకు తెలిసిపోతుందనే విషయం తెలియజేయాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా రౌడీషీటర్ల ఆగడాలు, దౌర్జన్యాలు చేస్తున్నా, పాత పంథా కొనసాగిస్తున్నా తన ఫోన్ 94407 96800కు సమాచారం పంపాలన్నారు.

ఆకట్టుకున్న 'అరణ్య రోదన'

అనంతపురం కల్చరల్ : స్థానిక లలితకళాపరిషత్ మాసవారీ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం పరిషత్ ఆవరణలో నిర్వహించిన 'అరణ్య రోధన' నాటకం ఆకట్టుకుంది. కార్యక్రమానికి పరిషత్ ప్రధాన కార్యదర్శి పద్మజ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రంగస్థల నటులు వెంకటసుబ్బయ్య, దయానంద్, రామాంజినేయులు, రాజకుళ్లాయప్ప, యస్‌యం బాషా, వరప్రసాద్, వెంకటరామిరెడ్డి, హసీన, మాధురి పాల్గొన్నారు.

నారా లోకేశ్‌కు ఘనస్వాగతం


నారా లోకేశ్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే కేశవ్

ఉరవకొండ, మార్చి 10: శంఖారావం సభకు ఉరవకొండకు విచ్చేసిన నారాలోకేశ్‌కు ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, టీడీపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. హెలిప్యాడ్ వద్ద నారాలోకేశ్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. స్థానిక టీడీపీ నాయకులను లోకేశ్‌కు ఎమ్మెల్యే పరిచయం చేశారు. లోకేశ్‌ను కలిసిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, దేవినేని పురుషోత్తం, రేగాటి నాగరాజు,మండల కన్వీనర్లు విజయ్‌భాస్కర్, నూతేటి వెంకటేశులు, ప్రసాద్, మారయ్య, పెద్దతిప్పయ్య, మల్లికార్జున, దండా ప్రసాద్, నాగేంద్ర ఉన్నారు.

తాడిపత్రిలో పోటాపోటీగా ఫ్లెక్సీలు



తాడిపత్రిలోని గాంధీసర్కిల్‌లో ఏర్పాటుచేసిన టీడీపీ, వైసీపీ ఫ్లెక్సీలు

తాడిపత్రిటౌన్, మార్చి10: పట్టణంలో టీడీపీ, వైసీపీ ఫ్లెక్సీలు ఆదివారం పోటాపోటీగా ఏర్పాటు చేశారు. టీడీపీ ఆధ్వర్యంలో సోమవారం శంఖారావం సభ నిర్వహించనున్న నేపథ్యంలో తాడిపత్రిలోని గాంధీసర్కిల్‌లో ఆ పార్టీ మద్దతుదారులు 'మేము సిద్ధం ఫ్యాక్షన్‌కు కాదు.. అభివృద్ధి కోసం' అని మాజీ ఎమ్మెల్యే, జేసీ ప్రభాకర్‌రెడ్డి ఫొటోతో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. దీనిని గమనించిన వైసీపీ మద్దతుదారులు 'శంఖారావం ఎర్రబుక్కు కోసం.. సిద్ధం ప్రజా సంక్షేమం కోసం' అంటూ పోటీగా ఫ్లెక్సీ కట్టారు. శాంతిభద్రతల సమస్యల తలెత్తే అవకాశం ఉండడంతో పోలీసులు కలుగజేసుకుని రెండు ఫ్లెక్సీలను తీసివేయించారు. ఈ ఫ్లెక్సీలతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

30వ వార్డులో అశ్మిత్‌రెడ్డి పర్యటన


చిరువ్యాపారితో మాట్లాడుతున్న జేసీ అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రిటౌన్, మార్చి 10: బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 30వ వార్డు భగత్‌సింగ్‌నగర్‌లో ఆదివారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జేసీ అశ్మిత్‌రెడ్డి పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలపై ఆరాతీశారు. అనంతరం టీడీపీ ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. టీడీపీ అధికారంలోకి రాగానే హామీలన్నీ అమలుచేస్తామని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్‌కు ఓటువేసి గెలిపించాలని అశ్మిత్‌రెడ్డి కోరారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి మరింత కృషి చేయాలి


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పామిడి, మార్చి 10: గుంతకల్లు నియోజకవర్గంలో టీడీపీ బలపడేందుకు మరింత కృషి చేయాలని ఆ పార్టీ నాయకులు అన్నారు. పట్టణంలోని నూతన ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఆదివారం టీడీపీ నాయకులు విలేకరులతో మాట్లాడారు. నియోజవర్గంలో టీడీపీ అధిష్ఠానం ఎవరికి టికెట్ ప్రకటిస్తే వారి విజయానికి కృషి చేయాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం టీడీపీలో చేరారన్నారు. నియోజకవర్గంలో ఎవరికి టిక్కెట్ వచ్చినా అందరూ కలిసి మెలసి టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థిని గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. సుధాకర్‌రెడ్డి, ఓబులేసు, చంద్రాచారి, రవికుమార్, అశోక్ పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్యాయత్నం

గుత్తి, మార్చి 10: పట్టణంలోని కమటి వీధికి చెందిన మంజుల అనే యువతి ఆదివారం విషద్రావకం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబసభ్యులు గమనించి యువతిని చికిత్సనిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యయత్నానికి కారణాలు తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

గుంతకల్లుటౌన్, మార్చి 10: పట్టణంలోని రైల్వే విద్యుత్ ఆఫీస్ సమీపంలోని రిజర్వాయర్ వద్ద పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య ఆదివారం తెలిపారు. వజ్రకరూరు మండలం కొనకొండ్లకు చెందిన చాకలి యలమకూరు అశోక్, కొనకొండ్లకు చెందిన దిద్దికట్టి రాజు రైల్వే విద్యుత్ ఆఫీస్ సమీపంలోని రిజర్వాయర్ వద్ద పీడీఎస్ బియ్యం తరలిస్తుండగా దాడులు చేసి 20 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

యల్లనూరు: మండలకేంద్రంలో ఆదివారం అక్రమంగా తరలిస్తున్న 1345కేజీల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని హెడ్ కానిస్టేబుల్ వెంకటరాముడు తెలిపారు. అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి బియ్యాన్ని తరలిస్తున్న బొలెరో వాహనంతోపాటు ఆటోను సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

కోడిపందెంరాయుళ్ల అరెస్ట్

కూడేరు, మార్చి 10: మండల పరిధిలోని అరవకూరు గ్రామ సమీపంలో కోడిపందాలు ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు తనిఖీలు చేశారు. ఆదివారం అరవకూరు గ్రామ సమీప ప్రాంతంలో కోడిపందాలు ఆడుతునట్లు సమాచారం రావడంతో సీఐ శివరాముడు ఆదేశాలతో పోలీసులు తనిఖీలు చేయగా 11 మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.5,800తో పాటు రెండుకోళ్ల సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

రైలుకిందపడి వృద్ధుడి ఆత్మహత్య

పెద్దపప్పూరు, మార్చి 10: మండలంలోని చీమలవాగుపల్లి గ్రామానికి చెందిన ఆంజనేయులు(90) అనే వృద్ధుడు రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ శరత్‌చంద్ర తెలిపారు. గ్రామానికి చెందిన ఆంజనేయులు కుటుంబ కలహాలతో ఆదివారం సాయంత్రం చీమలవాగుపల్లి సమీపంలో ఉన్న రైల్వే ట్రాక్‌పై రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తాడిపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ద్విచక్రవాహనం బోల్తా.. మహిళ మృతి

పుట్లూరు, మార్చి10: మండలంలోని శనగలగూడూరు గ్రామశివారులో ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో ధనలక్ష్మి (43) అనే మహిళ మృతిచెందినట్లు ఆదివారం పోలీసులు తెలిపారు. యల్లనూరుకు చెందిన ధనలక్ష్మి పనినిమిత్తం అనంతపురం వెళ్లేందుకు కుమారుడు గణేశ్‌తో కలిసి బైక్‌లో బయలుదేరారు. శనగలగూడూరు గ్రామ సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. దీంతో తలకు బలమైన గాయం కావడంతో తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. సోదరి భూలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ హేమాద్రి తెలిపారు.

12 టెట్రా ప్యాకెట్ల స్వాధీనం

యల్లనూరు, మార్చి 10: మండలంలోని తిమ్మంపల్లి గ్రామంలో ఆదివారం మద్యం ప్యాకెట్లు విక్రయిస్తున్న శ్రీరాములును అరెస్ట్‌చేసి అతనివద్ద నుంచి 12 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని ఏఎస్‌ఐ సంపత్ తెలిపారు. అందిన సమాచారం మేరకు పెట్రోల్ బంక్ వద్ద దాడిచేసి నిందితున్ని అరెస్ట్‌చేసి కేసు నమోదుచేసినట్లు ఆయన తెలిపారు.

మీలో ఒకడిగా ఉంటా... విజయం సాధిద్దాం

● టీడీపీ అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు


అమిలినేని సురేంద్రబాబును కలిసిన ఆలయ కమిటీ సభ్యులు

కళ్యాణదుర్గం, మార్చి 10: మీలో ఒకడిగా ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని అందరి కృషితో కళ్యాణదుర్గం నియోజకవర్గంలో టీడీపీ విజయాన్ని సాధిద్దామని ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు అన్నారు. ఆదివారం ఆయన స్వగృహంలో కళ్యాణదుర్గానికి చెందిన తొగటవీర క్షత్రియ సంఘం సభ్యులు కలిశారు. తమ కుల దైవం చౌడేశ్వరీ దేవి ఆలయ అభివృద్ధికి సహకరించాలని సంఘ సభ్యులు సురేంద్రబాబును కోరారు. వెంటనే స్పందించిన ఆయన రూ.2 లక్షల నగదును కమిటీ సభ్యులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ వెనుకబడ్డ కళ్యాణదుర్గం నియోజకవర్గాన్ని అందరి సహకారంతో అభివృద్ధి పథంలో నడిపించేందుకు అహర్నిశలు శ్రమిస్తానని అన్నారు. అందరూ ఐక్యంగా వుంటూ కళ్యాణదుర్గం కంచుకోటలో గ్రామగ్రామాన టీడీపీ జెండా ఎగురవేయడమే ధ్యేయమన్నారు. ఆ దిశగా ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త ముందుకు కదిలివచ్చి విజయానికి శ్రమించాలని పిలుపునిచ్చారు. ఆలయ అభివృద్ధికి స్పందించి ఆర్థిక సహాయాన్ని అందించిన సురేంద్రబాబును సంఘం సభ్యులు పూలమాలలు, దుశ్శాలువాలతో సన్మానించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆలయాల అభివృద్ధికి శ్రమిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

● నారా లోకేశ్‌కు విన్నవించిన ప్రభుత్వ ఉద్యోగులు


లోకేశ్‌కు వినతి పత్రాన్ని ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఉరవకొండ, మార్చి 10: సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్ అమలు చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను కోరారు. ఉరవకొండలో శంఖారావం సభకు విచ్చేసిన ఆయనను కలిసి విన్నవించారు. జీవో నంబర్ 177ను రద్దు చేయాలని కోరారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తూనే అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఏపీటీఎఫ్ నాయకులు భాస్కర్, హనుమప్ప, దాదాఖలందర్ పాల్గొన్నారు. అలాగే మీసేవలను యథావిధిగా కొనసాగించాలని మీసేవ ఆపరేటర్స్ నారాలోకేశ్‌ను కోరారు. టీడీపీ అధికారంలోకి వస్తే మీసేవ కేంద్రాలు కొనసాగుతాయని ఆయన హామీ ఇచ్చినట్లు ఆపరేటర్స్ సంఘం నాయకుడు కుమార్ భరత్ తెలిపారు.

రాయదుర్గం: రెడీమేడ్ జీన్స్ గార్మెంట్స్ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న కార్మికుల సమస్యలను టీడీపీ అధికారంలోకి రాగానే పరిష్కరించాలని నారా లోకేశ్‌కు విన్నవించారు. ఆదివారం గార్మెంట్స్ కార్మికులు ఆయనకు వినతిపత్రాన్ని సమర్పించారు. విద్యుత్ బిల్లులు విపరీతంగా పెరిగాయని, కరోన కాలం నుంచి జీవనం కష్టతరంగా మారిందని విన్నవించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కార్మికులు తిప్పేస్వామి, రామకృష్ణ, చిదానంద ఉన్నారు.


రాయదుర్గంలో వినతిపత్రం ఇస్తున్న గార్మెంట్స్ కార్మికులు

శంఖారావం సభకు తరలిన టీడీపీ శ్రేణులు



శంఖారావం సభకు తరలివెళ్తున్న బొమ్మనహాళ్, రాయదుర్గం మండలాల నాయకులు

బొమ్మనహాళ్, మార్చి 10: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తలపెట్టిన శంఖారావం సభకు బొమ్మనహాళ్ మండలం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. రాయదుర్గం పట్టణంలో ఆదివారం రాయల్ కాలేజీలో జరిగిన శంఖారావం సభకు పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో మండలంలోని గోవిందవాడ, నేమకల్లు, దర్గాహోన్నూరు తదితర గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండాపురం కేశవరెడ్డి, బలరాంరెడ్డి, కొత్తపల్లి మల్లికార్జున, ముల్లంగి నారాయణస్వామి, కొత్తపల్లి తిమ్మరాజు, ఎర్రగుంట్ల వెంకటేశులు, అప్పారావు, కేశప్ప, ఉప్పరహాళ్ స్వామి, మహేంద్ర, పయ్యావుల అనిల్, పయ్యావుల నాగరాజు, సోమనాథ్‌గౌడ్, గోవిందు, ధర్మపురి ఆంజనేయులు, మల్లన్న, నవీన్, మల్లీడు శీన, రాము, ప్రభు, నాగరాజు పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: నారా లోకేశ్ చేపట్టిన శంఖారావం కార్యక్రమం పట్టణంలోని రాయల్ డిగ్రీ కళాశాలలో నిర్వహించడంతో టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఆదివారం మండలంలోని చదం, ఆర్‌బీ వంక, డీ కొండాపురం, వజ్రవన్నూరు. టీ వీరాపురం, ఆవులదట్ల తదితర గ్రామాల నుంచి ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాల ద్వారా భారీగా తరలివెళ్లారు.

పుట్లూరు: ఉరవకొండలో నారా లోకేశ్ నిర్వహించిన శంకారావం సభకు ఆదివారం మండల నాయకులు పెద్దఎత్తున తరలివెళ్లారు. పుట్లూరులో పార్టీ కార్యాలయం వద్ద సైకో పోవాలి, సైకిల్ రావాలి అంటూ నినాదాలు చేశారు. తరలివెళ్లిన వారిలో బాలాపురం రామచంద్రారెడ్డి, రవికుమార్‌రెడ్డి, శ్రీనివాసులునాయుడు, రంగయ్య, శివారెడ్డి ఉన్నారు.

170 మందికి ప్రశంసాపత్రాల పంపిణీ


ప్రశంసాపత్రం అందుకుంటున్న క్లస్టర్ ఇన్‌చార్జి సన్నన్న

రాయదుర్గం, మార్చి 10: తెలుగుదేశం పార్టీ చేపట్టిన బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన 170 మంది బీఎల్ఏలు, యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్‌లెవెల్ ఇన్‌చార్జిలు, క్లస్టర్లకు నారా లోకేశ్ ఆదివారం ప్రశంసాపత్రాలను అందించారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి చేపట్టిన కార్యక్రమంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ ఎంతో దోహద పడిందని ఆయన అన్నారు.

ఎమ్మెల్యే కేశవ్‌ను గెలిపించాలి

● జనసేన జిల్లా కార్యదర్శి గౌతం

ఉరవకొండ, మార్చి 10: రాబోవు ఎన్నికల్లో ఉరవకొండలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేశవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి చరిత్రను తిరిగి రాస్తామని జనసేన జిల్లా కార్యదర్శి గౌతం అన్నారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక అడ్డగోలు దోపిడీ తప్ప అభివృద్ధి లేదన్నారు. తల్లి, చెల్లిని తరిమేసిన జగన్‌కు పవన్‌ను విమర్శించే అర్హత లేదన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసింది కేవలం ఎమ్మెల్యే కేశవ్ అన్నారు. ఉరవకొండలో కేశవ్‌ను మరోసారి గెలిపించి, మన ప్రాంత గళాన్ని వినిపించేందుకు టీడీపీ, జనసేన నాయకులు కృషి చేయాలన్నారు.

పెన్షనర్స్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

గుంతకల్లుటౌన్, మార్చి 10: ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నుకున్నారు. స్థానిక అంజుమన్ వీధిలోని అసోసియేషన్ భవనంలో ఆదివారం సమావేశాన్ని నిర్వహించారు. అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడిగా ఈఓ రాముడు, ప్రధాన కార్యదర్శిగా రామారావు, కోశాధికారిగా దాదాఖాన్, గౌరవఅధ్యక్షుడిగా జీఎంవీ చలపతితో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలన్నారు.

లారీ నుంచి పడి వ్యక్తి మృతి

తాడిపత్రిటౌన్, మార్చి10: మండలంలోని వెంకటరెడ్డిపల్లి గ్రామ సమీపంలో లారీపై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి చిన్న ఓబులేసు (35) మృతిచెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. కడప జిల్లా కొండాపురం మండలం కోడూరు గ్రామానికి చెందిన చిన్నఓబులేసు హమాలీ పనులకు వెళుతుండేవాడు. రోజు మాదిరిగానే ఆదివారం పనులకు వెళ్లాడు. పనులు ముగించుకొని లోడుతో ఉన్న లారీపై కూర్చొని వస్తుండగా వెంకటరెడ్డిపల్లి గ్రామ సమీపంలోకి రాగానే జారి కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం తాడిపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడని పోలీసులు తెలిపారు.

మద్దానేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

రాయదుర్గంరూరల్, మార్చి 10: మండలంలోని 74 ఉడే గోళం గ్రామ సమీపంలో వెలసిన మద్దానేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. స్వామివారికి ఉదయాన్నే గంగపూజ, బిల్వార్చన, పుష్పాలంకరణ తదితర పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో హోమాలు నిర్వహించారు. సోమవారం 80వ బ్రహ్మ రథోత్సవ నిర్వహిస్తున్నట్లు ఈఓ నరసింహారెడ్డి తెలిపారు. వారంరోజులపాటు నిర్వహించే బ్రహ్మోత్సవంలో భాగంగా మద్దానేశ్వరస్వామి జాతర నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

హుండీ ఆదాయం లెక్కింపు

రాయదుర్గం, మార్చి 10: పట్టణంలోని సాయిబాబా దేవాలయంలో ఆదివారం ఉదయం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. 2023 ఆగస్టు నుంచి ఇప్పటి వరకు భక్తులు హుండీలో వేసిన కానుకలు, ముడుపుల సొమ్మును లెక్కించగా రూ.3.41 లక్షలు ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు జయంతి రాధాకృష్ణ, సభ్యులు బండి కిష్టప్ప, రామాంజనేయులు, గెల్లి రామరాజు పాల్గొన్నారు.

నేడు శంఖారావం సభ

తాడిపత్రిటౌన్, మార్చి10: పట్టణంలో సోమవారం మధ్యాహ్నం 1 గంటకు శంఖారావం సభ నిర్వహించనున్నట్లు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జేసీ అశ్మిత్‌రెడ్డి తెలిపారు. కడపరోడ్డు వాసవీవృద్ధాశ్రమం పక్కనున్న ఖాళీ స్థలంలో సభకు సంబంధించి పనులను పూర్తిచేసినట్లు తెలిపారు. సభకు నారా లోకేశ్ హాజరై ప్రసంగించనున్నారని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

యాడికి: తాడిపత్రిలో సోమవారం నిర్వహించే టీడీపీ శంఖారావం సభను విజయవంతం చేయాలని మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, నాయకుడు చవ్వా గోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. సభకు నారా లోకేశ్ హాజరుకానున్నారని వారు తెలిపారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని వారు కోరారు.

సాగర్ పరిశ్రమలో భద్రతా వారోత్సవాలు



అధికారికి బొకే అందజేస్తున్న పరిశ్రమ ఉద్యోగి

యాడికి, మార్చి10: మండలంలోని గుడిపాడు వద్దనున్న సాగర్ సిమెంట్ పరిశ్రమలో ఆదివారం 53వ జాతీయ భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అనంతపురం వారు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భద్రతా నియమాలను పాటిస్తూ ఫ్యాక్టరీని ప్రమాదరహితంగా నిలపాలని అన్నారు. ఇంట్లోని ప్రతి మహిళ ఒక సేఫ్టీ ఆఫీసర్‌గా అభివర్ణించారు. వైస్ ప్రెసిడెంట్ రంగారెడ్డి, పరిశ్రమ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

గుంతకల్లుటౌన్, మార్చి 10: పట్టణంలో ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక ఆ సంఘం కార్యాలయం నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు మహిళలతో ర్యాలీ నిర్వహించారు. సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మణి, నియోజకవర్గ కార్యదర్శి ఆశాబీ మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత మహిళల మీద హింస, అత్యాచారాలు ఎక్కువయ్యాయన్నారు. సినిమాలలో అశ్లీలంగా చూపిస్తూ వారి గౌరవాన్ని దెబ్బతీస్తున్నారన్నారు. సంఘం పట్టణ కార్యదర్శి మాబున్ని, సభ్యులు స్వర్ణ, ఐఎఫ్‌టీయూ నియోజకవర్గ కార్యదర్శి చిన్నా, సభ్యులు జిలాన్, రామాంజినేయులు, బాషా, రామదాసు పాల్గొన్నారు. అలాగే అల్లీపీరా మఠంలో ఐద్వా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా నాయకురాలు శ్యామల మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. జ్యోతి, అధ్యాపకురాలు శశికళ, యూటీఎఫ్ జిల్లా కోశాధికారి రాఘవేంద్ర, అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకురాలు రేష్మా, రంగమ్మ, లక్ష్మీబాబు పాల్గొన్నారు.


గుత్తిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

గుత్తి: పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం నుంచి గాంధీ చౌక్, ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ సాగింది. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐద్వా సంఘం మండల కార్యదర్శి రేణుక మాట్లాడుతూ మహిళలకు సమానత్వం, గౌరవం దక్కాలని కొన్నేళ్లుగా పోరాటాలు చేస్తున్నా సాధ్యం కాలేదన్నారు. సీఐటీయూ నాయకురాలు నిర్మల, కవిత, రైతు సంఘం మండల కార్యదర్శి రామకృష్ణ, మల్లికార్జున పాల్గొన్నారు.

వైభవంగా యణ్ణేరంగనాథేశ్వరస్వామి రథోత్సవం


రథాన్ని లాగుతున్న భక్తులు

బొమ్మనహాళ్, మార్చి 10: మండలంలోని గోవిందవాడ గ్రామంలో వెలసిన యణ్ణేరంగనాథేశ్వర స్వామి రథోత్సవం ఆదివారం సాయంత్రం అంగరంగ వైభవంగా సాగింది. మహాశివరాత్రి సందర్భంగా ప్రతి ఏటా స్వామి వారి ఉత్సవాలు మూడు రోజులుగా సాగుతాయి. ఆదివారం ఉదయం పూజలు ప్రారంభించారు. అభిషేకం జరిపించి పల్లకి మహోత్సవం చేశారు. విశేష పుష్పాలంకరణ చేసిన అనంతరం నైవేద్యం సమర్పించి మహామంగళహారతి అందించారు. సాయంత్రం 6 గంటలకు భారీ జనసందోహం మధ్య స్వామివారి రథోత్సవం సాగింది. ఎస్‌ఐ శ్రీనివాసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వన్నూరుస్వామి, ఉమారాజ్, దేవేంద్రప్ప, గురురాజ్ గౌడ్, మృత్యుంజయ, టీడీపీ నాయకులు సోమనాథ్‌గౌడ్, ఎస్‌జీ వన్నూరు స్వామి, మాజీ సర్పంచ్ దేవేంద్రప్ప, కటింట్లి సుంకన్న, బంగి లోకేష్, నటరాజ్, రాతింటి వన్నూరుస్వామి, వన్నేష్ పాల్గొన్నారు.

జంబణ్ణతాత రథోత్సవం..


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

డీ.హీరేహాళ్, మార్చి 10: మండలంలోని పులకుర్తి గ్రామంలో వెలసిన సద్గురు జంబణ్ణతాత రథోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారికి పూజలు నిర్వహించి తమ మొక్కులు తీర్చుకున్నారు. సాయంకాలం జంబణ్ణతాత రథాన్ని భక్తులు తెచ్చిన భారీ గజమాలతో అలంకరించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డప్పు వాయిద్యాల నడుమ రథోత్సవ కార్యక్రమాన్ని కన్నుల పండువగా ఊరేగించారు. ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. రథోత్సవానికి వచ్చిన భక్తులకు అక్కడే ఆలయం వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు.

గొరవయ్యలకు పాలుపోయు కార్యక్రమం


గొరవయ్యలకు పాలుపోయు కార్యక్రమాన్ని వీక్షిస్తున్న భక్తులు

కుందుర్పి, మార్చి 10: ఈశ్వరస్వామి రథోత్సవంలో భాగంగా ఆదివారం కుందుర్పి మండల పరిధిలోని రుద్రంపల్లి గ్రామంలో గొరవయ్యలకు పాలుపోయు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ఆలయం ముందుంచి భక్తులు తెచ్చిన అరటిపండ్లు, పాలు తాగుతూ నృత్యాలు చేస్తూ చూపరులను ఆకట్టుకున్నారు. ఈశ్వరాలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

శాస్త్రోక్తంగా మన్యుసూక్త హోమం


అలంకరణలో ఆంజనేయస్వామి

గుంతకల్లు, మార్చి10: పూర్వభాద్రా నక్షత్ర సంక్రమణాన్ని పురస్కరించుకుని కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానంలో మన్యుసూక్త హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం ఆలయంలో ఆంజనేయ స్వామి ఉత్సవమూర్తికి అభిషేకం నిర్వహించి అలంకారాలు చేశారు. అనంతరం హోమాన్ని చేపట్టారు. ఆలయ ఈఓ భద్రాజీ, ఆలయ అధికారులు, వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు.

ఘనంగా వసంతోత్సవం


స్వామి వారి విగ్రహాలను పల్లకిలో తీసుకెళ్తున్న భక్తులు

గుంతకల్లుటౌన్, మార్చి 10: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని బుగ్గసంగాల గ్రామంలో వెలసిన బుగ్గసంగమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి వసంతోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి మూలవిరాట్టుకు అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. బుగ్గసంగమేశ్వర స్వామి, పార్వతి, వినాయక ఉత్సవ విగ్రహాలను పల్లకిలో కొలువుదీర్చారు. మేళతాళాల మధ్య ఉత్సవ మూర్తులను కోనేటి వద్దకు తీసుకెళ్లారు. కోనేటిలో ఉత్సవ మూర్తులను అభిషేకాలు చేశారు. ఆలయ ఈఓ కృష్ణయ్య, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన అశ్వత్థం తిరునాళ్ల


ప్రత్యేక అలంకరణలో అశ్వత్థ నారాయణస్వామి

పెద్దపప్పూరు, మార్చి 10: మండలంలోని చిన్నపప్పూరు సమీపంలో వెలసిన అశ్వత్థ నారాయణస్వామి, చక్రస్థాపిత భీమలింగేశ్వరస్వామి తిరుణాళ్ల ఆదివారంతో ముగిసింది. మాఘ మాసం చివరి ఆదివారం పురస్కరించుకొని స్వామివార్లకు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. మాఘమాసం చివరివారం కావడంతో పరిసర జిల్లాల నుంచి భక్తులు అధికసంఖ్యలో స్వామివార్లను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా వీరభద్ర స్వామి రథోత్సవం

ఉరవకొండ, మార్చి 10: వజ్రకరూరు మండల పరిధిలోని తట్రగల్లు గ్రామంలో వీరభద్ర స్వామి రథోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలో స్వామివారి మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కల్యాణోత్సవం కన్నుల పండువగా సాగింది. ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకెళ్లి రథంపై అధిష్ఠింప చేశారు. రథాన్ని ఆలయం నుంచి ఎదురుబసవన్న గుడి వద్దకు లాగి, యథాస్థానానికి చేర్చారు.

గుమ్మనూరుకు టిక్కెట్ ఇవ్వొద్దు

● టీడీపీ శ్రేణుల భారీ ర్యాలీ

గుంతకల్లు, మార్చి 10: గుమ్మనూరు జయరాంకి ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వరాదని టీడీపీ నాయకులు ఆందోళన చేపట్టారు. పట్టణంలో ఆదివారం సాయంత్రం టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ ని ర్వహించారు. నియోజకవర్గంలోని మూడు మండలాల నుంచి వేలాది మంది కార్యకర్తలు, నాయకులు పాతగుంతకల్లులోని బీరప్ప దేవాలయం వద్దకు చేరుకున్నారు. పెద్ద సంఖ్యలో మహిళా కార్యకర్తలు తరలివచ్చారు. పాత గుంతకల్లు నుంచి మెయిన్ రోడ్డు మీదుగా ఎన్టీఆర్ సర్కిల్ వరకూ గుమ్మనూరురే వ్యతిరేక ప్లకార్డులు పట్టుకుని, నిరసన ధ్వనులు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ గుమ్మనూరు జయరాం క్రమశిక్షణ కలిగిన టీడీపీకి తగిన వ్యక్తి కాదని, అతడికి పార్టీ టిక్కెట్టు ఇస్తే గుంతకల్లు రణరంగంగా మా రుతుందన్నారు. కార్యక్రమంలో ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, తలారి మస్తానప్ప, టీ కేశప్ప, హనుమంతు, పాల మల్లికార్జున, కౌన్సిలర్లు కృపాకర్, శివన్న, శివ ప్ప, న్యాయవాది హేమాద్రి, ఆటో ఖాజా, ఫ్రూట్ మస్తాన్, ఫజులు, రామన్న చౌదరి, నాగరాజు, ఆకుల శీన, వెంకటేశ్, లక్ష్మయ్య, తలారి సరోజమ్మ, లక్ష్మీదేవి, మాధవి, గుత్తి నాయకులు జిలాన్ బాషా, శ్రీనివాస యాదవ్ పాల్గొన్నారు.


గుంతకల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు